



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 సంచిక : 143 తూర్పుగోదావరి జిల్లా ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ శనివారం 14 ఫిబ్రవరి 2026 పేజీలు : 12 వెల : 2/-


### సంక్షేమం - అభివృద్ధి

# సమతూకం



- 20 నెలల్లో ఎంతో చేశాం.. భవిష్యత్తులో మరింత చేస్తాం
- రూ. లక్ష కోట్లతో ఉద్యాన హబ్‌గా రాయలసీమ అభివృద్ధి
- గాడిలో విద్యుత్ వ్యవస్థ -తొలిసారిగా విద్యుత్ ఛార్జీల ట్రూడౌన్
- జనాభా నిర్వహణ కోసం ఈ సెషన్ లోనే పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ
- నల్లమల సాగర్‌పై తెలంగాణ అభ్యంతరాలు ఎందుకు
- ఫ్యాక్షన్ మనస్తత్వంతోనే హెరిటేజ్ సంస్థపై ఆరోపణలు
- గత పాలనలో జరిగిన మద్యం స్కాంను సుప్రీం కోర్టు కూడా తప్పు పట్టింది
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కూటమి అధికారంలోకి వచ్చాక సంక్షేమం- అభివృద్ధి సమతూకంగా సుపరిపాలన ప్రజలకు అందుతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ఎన్నికల్లో వాగ్దానాలను అమలు చేస్తూ రాష్ట్రాన్ని గాడిలో పెట్టడంతో పాటు...అభివృద్ధి బాట పట్టించామని వెల్లడించారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంలో భాగంగా అసెంబ్లీలో శుక్రవారం చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడారు. గత 20 నెలలుగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి-సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. గత ప్రభుత్వ పాలన వల్ల కలిగిన ఇబ్బందులను ఎలా అధిగమించింది వెల్లడించారు. నాటి ప్రభుత్వం చేసిన దురాగతాలను ఎండగట్టారు. రాష్ట్రంలో అభివృద్ధి-సంక్షేమాన్ని అడ్డుకునేలా కొందరు కుట్రలు పన్నుతున్నారని సీఎం చంద్రబాబు శాసన సభలో అన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."గత పాలనలో జరిగిన విధ్వంసం నుంచి రాష్ట్రం ఇప్పుడిప్పుడే కోలుకుంటోంది. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం టీడీపీ, బీజేపీ, జనసేన కలిసి పని చేశాయి. గత ప్రభుత్వ హయాంలో పాలకులు అసెంబ్లీలో అవమానించిన తీరుకు కన్నీళ్లు పెట్టుకున్నాను. 2019-24 మధ్య నాలాగే చాలా మంది కన్నీళ్లు పెట్టుకున్న పరిస్థితి. విశాఖ వెళ్తే పవన్ కల్యాణ్‌ను అడ్డుకున్నారు. గతంలో అరాచకాలు చేసిన వాళ్లు ఇప్పుడు నీతులు చెబుతున్నారు. ప్రజలు ప్రతీ అంశాన్నీ గమనిస్తూనే సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటారు. దాని ఫలితమే కూటమి అద్భుత విజయం. రాష్ట్రంలో జరిగిన విధ్వంసంపై అధికారంలోకి వస్తూనే 7 శ్వేత పత్రాలను విడుదల చేశాం. వెంటిలేటర్‌పై ఉన్న రాష్ట్రాన్ని ఆదుకున్న కేంద్రానికి ధన్యవాదాలు. నెలకు రూ. 2,750 కోట్ల మేర ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌గా అందిస్తున్నాం. ఏడాదికి రూ.33 వేల కోట్ల మేర నిధులు వెచ్చిస్తున్నాం. తల్లికి వందనం స్కీం కింద కుటుంబంలో ఎంతమంది పిల్లలున్నా అందరికీ ఆర్థిక సాయం అందించాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఇప్పటి వరకూ 43.5 కోట్ల ప్రయాణాలు జరిగాయి. దీపం 2.0 ద్వారా ఏడాదికి 3 సిలెండర్లు ఉచితంగా మహిళలకు అందిస్తున్నాం. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20 వేల రూపాయలు మూడు విడతల్లో రైతులకు అందిస్తున్నాం. అన్న క్యాంటీన్లను అన్ని నియోజకవర్గాల్లోనూ ఏర్పాటు చేస్తున్నాం. సమాజంలో ఆర్థికంగా వెనుకబడి ఉన్న వారందరినీ ఆదుకునేలా మిగతా .. 2లో..

### రహ్మాన్ విజయం..

## ప్రజల విశ్వాసానికి చిహ్నం

### బంగ్లా ఫలితాలపై మోదీ పోస్ట్



**విశ్వం వాయిస్ న్యూస్ :** బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలోని బంగ్లాదేశ్ నేషనలిస్టు పార్టీ (బీఎన్‌పీ) విజయం సాధించింది. ఈ ఫలితాలపై భారత ప్రధాని నరేంద్ర మోదీ స్పందిస్తూ రహ్మాన్‌కు శుభాకాంక్షలు తెలియజేశారు. బంగ్లాలో ప్రజాస్వామ్యయుత ప్రభుత్వానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని మోదీ హామీ ఇచ్చారు. "బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీని ఘన విజయం దిశగా నడిపించిన తారిఖ్ రహ్మాన్‌కు అభినందనలు. మీ నాయకత్వంపై బంగ్లా ప్రజల విశ్వాసానికి ఈ గెలుపు నిదర్శనం. ప్రజాస్వామ్య, ప్రగతిశీల సమ్మిళిత బంగ్లాదేశ్‌కు భారత్ ఎల్లప్పుడూ మద్దతుగా నిలుస్తుంది. ఇరుదేశాల మధ్య సంబంధాల బలోపేతం, ఉమ్మడి లక్ష్యాలపై ముందుకువెళ్లేందుకు మీతో (తారిఖ్ నేతృత్వంలోని ప్రభుత్వం) కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నాం" అని ప్రధాని మోదీ తన 'ఎక్స్' ఖాతాలో పోస్ట్ చేశారు. 299 పార్లమెంట్ స్థానాలు ఉన్న బంగ్లాదేశ్‌లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలంటే 150 మంది సభ్యుల సంఖ్యాబలం అవసరం. తాజా ఎన్నికల మిగతా .. 2లో..

## వాలంటైన్స్ డే.. ఆ లింక్‌లపై క్లిక్ చేయొద్దు

### పోలీసుల హెచ్చరిక

**విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రేమికుల దినోత్సవం నేపథ్యంలో సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలంగాణ పోలీసులు హెచ్చరిస్తున్నారు. నకిలీ డేటింగ్ ప్రొఫైళ్లు, గిఫ్ట్ ఆఫర్లు, ఫ్లవర్ డెలివరీ స్కామ్‌లు, వాలంటైన్స్ డిస్కౌంట్ వంటి లింక్‌లు పంపి సైబరాసురులు అమాయకులను లక్ష్యంగా చేసుకుంటున్నారని తెలిపారు. ఈ తరహా మోసాల వల్ల ఆర్థిక నష్టంతో పాటు వ్యక్తిగత డేటా చోరీ, సోషల్ మీడియా లేదా బ్యాంకు ఖాతాలు దుర్వినియోగం మిగతా .. 2లో..

### విజయ్ ర్యాలీలో..

## గుండెపోటుతో వ్యక్తి మృతి



**విశ్వం వాయిస్ న్యూస్ :** సినీ నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ ప్రచార సభలో ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. తమిళ నాడులోని సేలంలో జరిగిన ఎన్నికల ర్యాలీకి పెద్ద ఎత్తున అభిమానులు, కార్యకర్తలు హాజరయ్యారు. విజయ్ మాట్లాడుతుండగా.. ఓ వ్యక్తి స్పృహ కోల్పోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. అతడు గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడిని మహారాష్ట్రకు చెందిన సూరజ్ (37)గా గుర్తించారు. ఉపాధి నిమిత్తం అతడు కొన్నేళ్ల క్రితం మిగతా .. 2లో..

### పాలక మండళ్లు బాధ్యతగా ఉంటే

## ఆలయాల్లో అపచారాలు జరగవు

**గత పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తిరుమలలో అపచారాలు జరిగేవి కాదు - గతంలో జరిగిన తప్పులు పునరావృతం కారాదు రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాలి - కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధి, ధర్మ పరిరక్షణకు కట్టుబడి ఉంటుంది శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ మార్గాన్ని వర్చువల్‌గా ప్రారంభించిన రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**

**విశ్వం వాయిస్ న్యూస్ :** పాలక మండళ్లు బాధ్యతాయుతంగా విధులు నిర్వహిస్తే దేవాలయాల్లో అపచారాలు జరగవని, రాజకీయాలకు అతీతంగా దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత పాలక మండళ్లపై ఉందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వ హయాంలో తిరుమలలోనే ఎన్నో అపచారాలు జరిగాయన్నారు. నాటి పాలక మండలి బాధ్యతగా వ్యవహరిస్తే తప్పులు జరిగేవి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన ఆలయ పాలక మండళ్లు గత ప్రభుత్వంలో జరిగిన తప్పులు, అపచారాలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నూతనంగా నిర్మించిన శ్రీకాళహస్తి మిగతా .. 2లో..



### నెహ్రూ 'పంచశీల ఒప్పందం'

## అందుకే చేసుకుని ఉంటారు : సీడీఎస్



**విశ్వం వాయిస్ న్యూస్ :** స్వాతంత్ర్యం తర్వాత భారత్-చైనా సంబంధాల గురించి చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్ జనరల్ అనిల్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. సరిహద్దుల్లో శాంతి, స్థిరత్వం కోసమే అప్పటి భారత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ 1954లో పంచశీల ఒప్పందం చేసుకొని ఉంటారన్నారు. దేహ్రాదూన్‌లో ఓ కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎస్.. భారత్-చైనా చారిత్రక సంబంధాలపై ప్రసంగించారు. ఆ ఒప్పందంలో భాగంగానే టిబెట్‌ను చైనాలో భాగమని భారత్ గుర్తించిందన్నారు. "బ్రిటిషర్లు వెళ్లిపోయిన తర్వాత.. సరిహద్దు ప్రాంతాలను నిర్ణయించుకునే అవకాశం భారత్‌కు వచ్చింది. తూర్పున మెక్‌మోహన్ రేఖ, లద్దాఖ్‌లోని ప్రాంతాల గురించి నెహ్రూకు మిగతా .. 2లో..

### 'నేషనల్ ట్రావెల్ మార్ట్' ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో

## కొత్త అధ్యయనానికి నాంది

**టూర్ ఆపరేటర్లే ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి బ్రాండ్ అంబాసిడర్లు అని మంత్రి దుర్గేష్ వెల్లడి గడిచిన 18 నెలల్లో రూ.20,088 కోట్ల పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాల సృష్టి 'స్వర్ణాంధ్ర విజన్ 2047' దిశగా పర్యాటక రంగం పరుగులు పెడుతోందని వెల్లడి**



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'నేషనల్ ట్రావెల్ మార్ట్' కేవలం ఒక సమావేశం కాదు.. ఇది ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగంలో ఒక సరికొత్త అధ్యయనానికి నాంది అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ అభివర్ణించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరియు అసోసియేషన్ ఆఫ్ డొమెస్టిక్ టూర్ ఆపరేటర్స్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా మిగతా .. 2లో..

### శ్రీశైలం వచ్చే వాహనాలకు

## నేటి నుంచి టోల్ మినహాయింపు



**శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయం రాత్రివేళల్లోనూ అందుబాటులో రవాణా సౌకర్యం**

**నంద్యాల, విశ్వం వాయిస్ న్యూస్ :** శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఈ నెల 13 నుంచి 16 వరకు దేవస్థానం, అటవీశాఖ టోల్‌గేట్ల వద్ద రుసుం మినహాయింపు నిస్తున్నట్లు నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి తెలిపారు. రాత్రివేళల్లోనూ రవాణా మిగతా .. 2లో..

### ఇంకా నిర్ణయం

## తీసుకోలేదు..

### ట్రంప్ గాజా శాంతిమండలిపై భారత్



**విశ్వం వాయిస్ న్యూస్ :** గాజా పునర్నిర్మాణం కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 'శాంతి మండలి'ని ఏర్పాటుచేసిన సంగతి తెలిసిందే. ఇందులో భాగం కావాలని భారత్‌కు ఇప్పటికే ఆహ్వానం అందింది. అయితే ఈ ప్రతిపాదనపై తాము ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తాజాగా భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ బోర్డులో భాగం కావాలని అమెరికా ప్రభుత్వం నుంచి భారత్‌కు ఆహ్వానం అందిందని, అయితే ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నామని, దీనిపై ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. ఈ బోర్డుకు సంబంధించి మిగతా .. 2లో..

### పుర తీర్పు.. రెండేళ్ల ప్రజాపాలనకు

## సంపూర్ణ ఆమోదం : సీఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** మున్సిపల్ ఎన్నికల్లో ప్రజల తీర్పు.. రాష్ట్రంలో రెండేళ్ల ప్రజాపాలనకు సంపూర్ణ ఆమోదంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభివర్ణించారు. పేద, మధ్య తరగతి ప్రజల సంక్షేమం, ప్రపంచ స్థాయి ప్రణాళికలు, కార్యాచరణతో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఈ తీర్పు ద్వారా తమ సంపూర్ణ ఆమోదం తెలిపారని ఎక్స్‌లో పోస్టు చేశారు. ఈ విజయం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనకు పునరంకితమవుతూ.. భవిష్యత్‌లో ప్రతి మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లను గొప్పగా అభివృద్ధి చేసి ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మిగతా .. 2లో..



### కరేబియన్ సముద్రం నుంచి ఇరాన్ దిశగా

## అమెరికా యుద్ధ నౌకలు



**విశ్వం వాయిస్ న్యూస్ :** అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో ఆ దేశంపై చర్యలకు అమెరికా సిద్ధమవుతోంది. ఇందులోభాగంగా ఇప్పటికే భారీస్థాయిలో అమెరికా సైన్యం ఇరాన్‌ను చుట్టుముట్టింది. తాజాగా అమెరికా విమాన వాహక నౌక మిగతా .. 2లో..

## హసీనా అప్పగింతను కోరతాం : బీఎన్‌పీ



**విశ్వం వాయిస్ న్యూస్ :** భారత్‌లో ఆశ్రయం పొందుతున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను తమకు అప్పగించాలని కోరతామని బీఎన్‌పీ వెల్లడించింది. "ఇది రెండు దేశాల విదేశాంగ శాఖలు నిర్ణయించాల్సిన అంశం. విచారణ ఎదుర్కొనేందుకు ఆమెను స్వదేశానికి పంపించాలని భారత ప్రభుత్వాన్ని కోరతాం" అని ఆ పార్టీ ప్రతినిధి సలాహుద్దీన్ అహ్మద్ అన్నారు. విద్యార్థుల ఆందోళనలతో ప్రధాని పదవి వీడిన షేక్ హసీనా.. 2024 ఆగస్టు నుంచి భారత్‌లోనే ఉంటున్నారు. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

# సంక్షేమం- అభివృద్ధి సమతూకం

సంక్షేమ కార్యక్రమాలు అందిస్తున్నాం. పీ4 ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు వస్తాయి. సంపద ఉంటేనే ప్రజలకు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయగలం... సంపద పంచగలం. అందుకే జీరో పావర్టీ ద్వారా పేదరిక నిర్మూలన కార్యక్రమాన్ని రాష్ట్రంలో చేపట్టాం. అట్టడుగు స్థాయిలో ఉన్న వారికి చేయూత అందించేందుకు పీ4 కార్యక్రమం. పేదరిక నిర్మూలనకు సంబంధించి దేశంలోనే ఇది అత్యుత్తమ మోడల్."అని సీఎం చంద్రబాబు చెప్పారు.

**పీపీపీతోనే ప్రగతి... పురోగతి**

"పీపీపీ వల్ల సంపద సృష్టి జరుగుతోంది. రోడ్లు, పోర్టులు, ఎయిర్ పోర్టులు ఈ విధానంలోనే నిర్మితం అవుతున్నాయి. పీపీపీ విధానంలో ప్రాజెక్టు నిర్మించి నిర్వహిస్తారు. నిర్దిష్ట కాలపరిమితి తర్వాత ప్రభుత్వానికి అప్పగిస్తారు. అమరావతిలో క్వాంటం కంప్యూటింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం. క్వాంటం నైపుణ్యాల కోసం కోర్సు నిర్వహిస్తుంటే 60 వేల మందికి పైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ప్రస్తుతం ఇంధన రంగంలో ట్రాన్సిషన్ సమయం నడుస్తోంది. హరిత ఇంధనానికి డిమాండ్ ఉంది. గ్రీన్ హైడ్రోజన్, గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తికి సంబంధించి ఏపీ, మహారాష్ట్ర ఓ మోడల్ అవుతాయి. ఏపీలో ప్రొజ్యూమర్ విధానంలో ఇంధన ఉత్పత్తి చేయాలని భావిస్తున్నాం. సోలార్ ప్యానళ్లను ఇళ్లపై ఏర్పాటు చేసుకుని గ్రిడ్ కు అనుసంధానిస్తాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా ప్రజారోగ్య సేవలను విస్తృతం చేస్తాం. ఈ నెల 16 తేదీన బిల్ గేట్స్ రాష్ట్రానికి వస్తున్నారు. గేట్స్ ఫౌండేషన్ సహకారంతో డిజిటల్ హెల్త్ రికార్డులను తయారు చేసి వ్యక్తిగత ఔషధాలను కూడా అందించే అవకాశం ఉంది. సంజీవని ప్రాజెక్టుపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యతను ఎమ్మెల్యేలు తీసుకోవాలి. జనాభా నిర్వహణపై ఈ అసెంబ్లీ సెషన్లోనే పాలసీ తెస్తాం. డెమో గ్రాఫిక్ డివిడెండ్ ను సమర్ధంగా వినియోగించుకోవడం ద్వారా సంపద సృష్టించేందుకు అవకాశం ఉంటుంది. మెగా డీఎస్సీ హామీ ఇచ్చి ఏడాది లోగానే టీచర్లకు పోస్టింగులు ఇచ్చాం. కానిస్టేబుళ్ల నియామకాలు కూడా పూర్తి చేసి స్టైఫండ్ ను రూ.4,500 నుంచి రూ.12,500కు పెంచాం. భూమి ఇవ్వకుండా, ప్రోత్సాహకాలు ఇవ్వకుండా పరిశ్రమలు, ఉద్యోగాలు ఎలా వస్తాయి...? ప్రముఖ పరిశ్రమలకు భూములు ఇస్తుంటే కొందరు వివాదం చేసే ప్రయత్నం చేస్తున్నారు. పరిశ్రమలను ప్రోత్సహించేలా ఎస్క్రో ఖాతా ఏర్పాటు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ తో వేగంగా అనుమతులు ఇస్తున్నాం. దేశంలోకి వచ్చిన విదేశీ పెట్టుబడుల్లో 25.6 శాతం ఏపీకే వచ్చాయంటే ఏపీ బ్రాండ్ విలువ ఏమిటో అందరూ అర్ధం చేసుకోవాలి. గత పాలకుల వేధింపుల కారణంగా అమర్ రాజా బ్యాటరీస్ పొరుగు రాష్ట్రానికి వెళ్లిపోయింది. విశాఖలో గూగుల్, టీసీఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమలు వస్తున్నాయి. అనకాపల్లిలో ఆర్సెల్లార్ మిట్టల్ కూడా స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నాయి. రామాయపట్నం వద్ద బీపీసీఎల్ కూడా రూ.70 వేల కోట్లతో రిఫైనరీని ఏర్పాటు చేస్తోంది. భాగస్వామ్య సదస్సులో రూ.13.5 లక్షల కోట్ల పెట్టుబడులు 610 ఎంఓయులు చేసుకున్నాం. మొత్తంగా రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల ఉద్యోగాలు వస్తాయి. 20 లక్షల ఉద్యోగాలను ఐదేళ్లలో ఇస్తామన్న హామీని నిలబెట్టు కుంటాం."అని సీఎం స్పష్టం చేశారు. "గత పాలకులు సమర్ధంగా నీటి నిర్వహణ చేపట్టలేదు. ఎన్టీఆర్ హంద్రీనీవా, గాలేరు-నగరి, తెలుగు గంగ లాంటి ప్రాజెక్టులతో రాయలసీమలో ప్రాజెక్టులు చేపట్టారు. వచ్చే మూడేళ్లలో ఉత్తరాంధ్రలోని అన్ని ప్రాజెక్టులనూ పూర్తి చేస్తాం. పోలవరం- వంశ ధారను లింక్ చేస్తాం. ఎడమ కాలువ ద్వారా ఈ ఏడాది అనకాపల్లి వరకూ నీటిని తీసుకెళ్తాం. హంద్రీనీవా కాలువలను పూర్తి చేసి కుప్పం వరకూ నీళ్లు తీసుకువెళ్లాం. చెరువులు నింపాం. రాయచోటికి కూడా నీరు తీసుకెళ్తాం. గాలేరు నగరి ద్వారా వచ్చే ఏడాది కడపకూ నీళ్లు పారిస్తాం. పోలవరం ప్రాజెక్టు నిర్మాణాన్ని ఎమ్మెల్యేలు కూడా ప్రత్యక్షంగా చూడాలని కోరుతున్నాను. గత పాలకులు రాజకీయ కక్షతో పోలవరాన్ని గోదాట్లో ముంచేశారు. డయాఫ్రాం వాల్ ధ్వంసం చేశారు. ఇప్పుడు రూ. 1000 కోట్లతో మళ్లీ డయాఫ్రాం వాల్ నిర్మిస్తున్నాం. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్ నెలలోగా జాతికి అంకితం చేస్తాం. ఏటా 3500 టీఎంసీల గోదావరి వరద జలాలు సముద్రంలోకి వృధాగా పోతున్నాయి. అందులో 200 టీఎంసీల నీటిని నల్లమల సాగర్ కు తరలిస్తాం. ఈ ప్రాజెక్టుకు తెలంగాణా అభ్యంతరం చెప్పటం సరికాదు. తెలుగు జాతిగా రెండు రాష్ట్రాలూ నీటిని సద్వినియోగం చేసుకోవాలి. అవసరమైతే ఈ అంశాన్ని సంప్రదింపుల ద్వారా ఓ నిర్ణయానికి రావచ్చు. ఒకటి రెండు అంశాలు పరిష్కారం అయితే కూర్చుని మాట్లాడు కుందామని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ప్రతిపాదించారు.

# ఆలయాల్లో అపచారాలు జరగవు

గిరిప్రదక్షణ రోడ్డును వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయం నుంచి వర్చువల్‌గా శుక్రవారం ఉదయం ప్రారంభించారు. సుమారు రూ. 10 కోట్ల అంచనా వ్యయంతో గిరి ప్రదక్షణ రోడ్డును నిర్మించారు. రాష్ట్ర సచివాలయంలో రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, దేవాదాయ శాఖ కార్యదర్శి డాక్టర్ హరి జవహర్ లాల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మన ఆలయాలు నాగరికతకు చిహ్నాలు. మన కళలు, మన వారసత్వం, మన సంస్కృతి, ధర్మ పరిరక్షణ ఆలయాలతో ముడిపడి ఉన్నాయి. అరుణాచలంలో గిరిప్రదక్షణ చేస్తారు అని తెలుసు. నాకు గిరిప్రదక్షణ చేయాలని చాలా కోరిక ఉంది. దేవాదాయ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆహ్వానం మేరకు, భక్తుల కోరిక మేరకు త్వరలో శ్రీకాళహస్తి క్షేత్రాన్ని సందర్శించి కచ్చితంగా స్వామి, అమ్మవార్లను దర్శించుకుంటాను. శివరాత్రికి రెండు రోజుల ముందు ఈ శ్రీకాళహస్తి గిరి ప్రదక్షణ మార్గాన్ని ప్రారంభించడం ఆనందంగా ఉంది. గత ప్రభుత్వం ఆలయాల పరిరక్షణ అంశాన్ని చాలా నిర్లక్ష్యం చేసింది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత దేవాదాయ మంత్రిగా రామనారాయణ రెడ్డి బాధ్యతలు స్వీకరించాక ఆలయాల పరిరక్షణను ఎంతో బాధ్యతగా ముందుకు తీసుకువెళ్తున్నాం. నిరాదరణకు గురైన ఎన్నో ఆలయాలను అభివృద్ధి చేస్తున్నారు. భక్తులు కోరుకుంటే ఏజెన్సీలో కూడా ఆలయాలు నిర్మించాలన్న ఆయన గొప్ప సంకల్పానికి మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

**శివరాత్రి తర్వాత గిరిప్రదక్షణ మార్గంలో మొక్కలు నాటుతాం**

శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ మార్గంలో గౌరవ ముఖ్యమంత్రివర్యులు శ్రీ చంద్రబాబు నాయుడు గారి ఆధ్వర్యంలో రూ. 10 కోట్లు వెచ్చించి సిమెంటు రోడ్డు నిర్మించాం. 22 కిలోమీటర్ల గిరి ప్రదక్షణ మార్గాన్ని మరింత ఆహ్లాదకరంగా తీర్చిదిద్దే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. అటవీ శాఖ ఆధ్వర్యంలో గిరిప్రదక్షణ మార్గానికి ఇరు వైపులా మొక్కలు నాటే కార్యక్రమానికి శివరాత్రి బ్రహ్మోత్సవాల అనంతరం శ్రీకారం చుట్టబోతున్నాం. శ్రీకాళహస్తి గిరిప్రదక్షణ ద్వారా ప్రతి భక్తుడికి కైలాసగిరి ప్రదక్షణ చేసిన పుణ్యఫలం దక్కాలని ఈ సందర్భంగా మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. కూటమి ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికీ, సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు కట్టుబడి ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నుంచి వర్చువల్ గా తిరుపతి జిల్లా కలెక్టర్ శ్రీ వెంకటేశ్వర్లు, శ్రీకాళహస్తి ఆలయ పాలక మండలి ఛైర్మన్ శ్రీ కొట్టే సాయి ప్రసాద్, రాష్ట్ర హస్త కళల నైపుణ్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీ కోలా ఆనంద్, తిరుపతి ఫారెస్ట్ కన్జర్వేటర్ శ్రీ సెల్వం, డీఎఫ్ఓ శ్రీ సాయిబాబా, శ్రీకాళహస్తి ఆలయ ఈవో శ్రీ బాపిరెడ్డి, ఆలయ పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

# అందుకే చేసుకుని ఉంటారు : సీడీఎస్

అవగాహన ఉండి ఉండొచ్చు. కానీ, ఈ ప్రదేశంపై (టిబెట్ సరిహద్దు ప్రాంతం) కాదు. అందుకే ఆయన చైనాతో పంచశీల ఒప్పందంపై ముందుకెళ్లారని భావిస్తున్నా. ఇదే చైనీయుల విషయానికొస్తే.. టిబెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకొని వారు సరిహద్దుల నుంచి లాసా (టిబెట్‌లోని నగరం), షిన్‌జియాంగ్‌లకు వెళ్లిపోయారు. ఈ ప్రత్యేక ప్రాంతం రెండు దేశాలకు ఎంతో ముఖ్యమైనదిగా మారింది. అందుకే చైనీయులు ఇక్కడ స్థిరత్వాన్ని కోరుకున్నారు. ఆ సమయంలో భారత్ కూడా చైనాతో మంచి సంబంధాలు కొనసాగించాలని భావించింది. ఈ క్రమంలోనే 1954లో టిబెట్‌ను చైనాలో భాగంగా గుర్తించింది. పంచశీల ఒప్పందంపై ఇరు దేశాలు సంతకాలు చేశాయి" అని సీడీఎస్ చౌహాన్ వివరించారు. పొరుగు దేశాలు ఒకరి అంతర్గత వ్యవహారాల్లో మరొకరు జోక్యం చేసుకోకూడదని, శాంతియుతంగా ముందుకు సాగాలనే ఉద్దేశంతో భారత్-చైనాల మధ్య 1954లో పంచశీల ఒప్పందం (ఐదు సూత్రాలు) జరిగింది. నాటి భారత ప్రధాని నెహ్రూ, చైనా ప్రధాని చౌ ఎన్‌లైలు సంతకాలు చేశారు. అయితే, చైనా వైఖరి చూస్తుంటే ఈ ఒప్పందం కేవలం వాణిజ్యం కోసమేనని అర్థమవుతోందని.. సరిహద్దు అంశంలో ఇది ఏమాత్రం ప్రతిబింబించలేదని సీడీఎస్ అభిప్రాయపడ్డారు. ఇప్పటికీ.. వాస్తవాధీన రేఖ సున్నిత ప్రాంతంగా ఉన్న విషయాన్ని గుర్తుచేశారు.

# కొత్త అధ్యయనానికి నాంది

ఫిబ్రవరి 13, 14 తేదీల్లో విశాఖలో నిర్వహిస్తున్న ఈ మెగా టూరిజం మార్ట్‌లో మంత్రి కందుల దుర్గేష్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ యొక్క తీరప్రాంతం, గిరిజన ప్రాంతాలు, వారసత్వ ప్రదేశాలు మరియు ఎకో-అడ్వెంచర్ టూరిజంను ప్రదర్శించడం, దేశీయ పర్యాటకాన్ని పెంచడమే లక్ష్యంతో టూర్ ఆపరేటర్లు, హోటల్ గ్రూప్ లు, ట్రావెల్ నిపుణులతో నిర్వహించిన సమావేశంలో పర్యాటక రంగం అభివృద్ధిలో టూర్ ఆపరేటర్ల ప్రాముఖ్యతను వివరిస్తూ టూర్ ఆపరేటర్లే మా బ్రాండ్ అంబాసిడర్లు అన్న మంత్రి దుర్గేష్ వ్యాఖ్యలతో హర్షధ్వానాలు వెల్లువెత్తాయి. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ కేవలం ఆధ్యాత్మిక వారసత్వానికే కాకుండా, పరివర్తన మరియు ఆవిష్కరణలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోందని అన్నారు. జాతీయ పతాక రూపకర్త పింగలి వెంకయ్య పుట్టిన ఈ నేల పట్ల రాష్ట్రం గర్వపడుతోందని తెలిపారు. ఛత్తీస్‌గఢ్ సంస్కృతిని, రామాయణ కాలం నాటి దండకారణ్య విశేషాలను ప్రస్తావిస్తూ, పొరుగు రాష్ట్రాలతో సమన్వయానికి ప్రాధాన్యతనిచ్చారు. కేంద్రం సహకారంతో సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటక రంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నూతన పర్యాటక పాలసీ 2024-29,పర్యాటక రంగానికి పరిశ్రమ హోదా, సబ్సిడీలు, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, స్టాంపు డ్యూటీ మినహాయింపులతో ఇన్వెస్టర్లకు పెద్దపీట వేస్తున్నామన్నారు. కేవలం 18 నెలల్లో రూ.20,088 కోట్ల విలువైన 117 ప్రాజెక్టులకు ఒప్పందాలు జరిగాయని, దీని ద్వారా 1,22,637 ఉద్యోగాల సృష్టికి మార్గం సుగమమైందని వెల్లడించారు. తద్వారా హోటల్స్, రిసార్ట్స్, థీమాటిక్ పార్క్ లు తదితరాలు పెద్దఎత్తున ఏర్పాటు చేయడానికి పెట్టుబడిదారులు ముందుకు వచ్చారన్నారు. కేవలం 'ఈజ్ ఆఫ్ డూయింగ్' మాత్రమే కాకుండా, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్' ద్వారా సింగిల్ విండో విధానంలో అనుమతులు జారీ చేస్తున్నామని స్పష్టం చేశారు. సరళీకృత విధానాలు, సింగిల్ విండో క్లియరెన్స్, ఇన్వెస్టర్ ఫెసిలిటేషన్ సెల్స్, రియల్-టైమ్ ట్రాకింగ్, పారదర్శకమైన భూ కేటాయింపులు నిర్ణీత కాలపరిమితిలో అనుమతులు మంజూరు చేస్తున్నామన్నారు.

**టూర్ ఆపరేటర్లు - మా స్టోరీ టెల్లర్స్:మంత్రి దుర్గేష్**

ఆంధ్రప్రదేశ్ అందాలను దేశ విదేశాల పర్యాటకులకు పరిచయం చేసే కథకులు, ప్రచారకర్తలు, నిర్వాహకులు టూర్ ఆపరేటర్లు అని మంత్రి దుర్గేష్ కొనియాడారు.. "ప్రభుత్వం పునాది వేస్తే, టూర్ ఆపరేటర్లు దానికి ప్రాణం పోస్తారు. మీరు కేవలం వ్యాపారవేత్తలు కాదు, మా రాష్ట్ర అందాలను ప్రపంచానికి వినిపించే స్టోరీ టెల్లర్స్" అని మంత్రి దుర్గేష్ కొనియాడారు. టూర్ ఆపరేటర్లే ప్రభుత్వానికి, మార్కెట్ డిమాండ్‌కు మధ్య వారధి అని, వారే మా అసలైన రాయబారులని పేర్కొన్నారు.ప్రభుత్వం కొత్త సర్క్యూట్‌లను, క్రూయిజ్‌లను లేదా హోమ్‌స్టే నమూనాలను ప్రవేశపెట్టినప్పుడు వాటిని మెరుగుపరిచి, ప్రమోట్ చేసినప్పుడే అవి విజయవంతమవుతాయన్నారు. ప్రభుత్వ విజన్‌ను పర్యాటక ప్యాకేజీలుగా, మధుర జ్ఞాపకాలుగా మార్చే శక్తి టూర్ ఆపరేట్లకు ఉందని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరియు టూర్ ఆపరేటర్లు చేతులు కలిపినప్పుడే పర్యాటకం వర్ధిల్లుతుందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర పర్యాటక ప్రాంతాలను క్షేత్రస్థాయిలో సందర్శించాలని కోరారు.తద్వారా ఇన్ బౌండ్ టూరిజంను పెంచాలని సూచించారు. సృజనాత్మకత, సంస్కృతి, సామాజిక ప్రభావాల అద్భుత కలయికతో టూర్ ఆపరేటర్లు, ఇన్వెస్టర్లు మరియు భాగస్వాములు అందరం కలిసి ఆంధ్రప్రదేశ్‌ను భారత్‌లోనే అత్యంత శక్తివంతమైన పర్యాటక కేంద్రంగా (భారతదేశపు ఎక్స్‌పీరియన్స్ క్యాపిటల్) తీర్చిదిద్దుదామని పిలుపునిచ్చారు.

**భవిష్యత్తు ప్రణాళికలు:**

విశాఖ నుండి అరకు వరకు త్వరలో కారవాన్ టూరిజం ప్రారంభిస్తామని, గ్రామీణ సంస్కృతిని పరిచయం చేసేలా హోమ్‌స్టేలు, బెడ్ అండ్ బ్రేక్ ఫాస్ట్ పాలసీ, టెంట్ సిటీలు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. త్వరలో రాబోయే మైస్, ఫిల్మ్ టూరిజం పాలసీలు అసెట్-లైట్ మోడల్ పెట్టుబడులకు ఊతమిస్తాయని భావిస్తున్నామన్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి కుంభమేళా తరహాలో టెంట్ సిటీలను సిద్ధం చేస్తామన్నారు. రాష్ట్రం కేవలం టెంపుల్ టూరిజానికే పరిమితం కాకుండా ఎకో, అడ్వెంచర్, క్రూయిజ్, రివర్, అగ్రి, హెరిటేజ్, మెడికల్ మరియు వెల్ నెస్ టూరిజంకు పెద్దపీట వేస్తోందని వివరించారు. మన రాష్ట్రం పర్యాటక రంగంలో ఒక 'స్టార్టప్' లాంటిది. ఇక్కడ వేగం, కొత్త ఆలోచనలు, అద్భుతమైన వృద్ధికి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. ఈ మార్ట్ ద్వారా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అధిక విలువ కలిగిన దేశీయ పర్యాటక గమ్యస్థానంగా రూపాంతరం చెందుతున్న తీరును ప్రపంచానికి చాటారు. ఆధ్యాత్మిక యాత్రలు, తీరప్రాంత పర్యాటకం, వారసత్వ సర్క్యూట్లు, గిరిజన పర్యాటకం, బౌద్ధ సర్క్యూట్, ఎకో-టూరిజం మరియు మైస్ వంటి వర్ధమాన రంగాల సామర్థ్యాన్ని విజయవంతంగా ప్రదర్శించారు.ఈ మార్ట్ ద్వారా రాష్ట్ర పర్యాటక భాగస్వాములు మరియు జాతీయ టూర్ ఆపరేటర్ల మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేసింది. ఏపీ పర్యాటక రంగ విశేషాలను పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ ఆమ్రపాలికాట వివరించారు. హ్రా మోడల్ పాలసీ, పార్ట్ నర్ షిప్, ప్రాసెస్ అద్భుతమైన ఫలితాలను ఇస్తోందని వారు తెలిపారు.ఏపీ పర్యాటక కొత్త పాలసీ 2024-29 ద్వారా కొత్త ఒరవడికి నాంది పలికామన్నారు. కార్యక్రమంలో ఛత్తీస్ గడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ నీలూశర్మ, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, ఏపీటీడీసీ ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి కాట, ఛత్తీస్ గడ్ డెవలప్ మెంట్ కార్పొరేషన్ ఎండీ వివేక్ ఆచార్య, ఏపీటీడీసీ ఈడీ పద్మావతి, ఏపీటీఏ డిప్యూటీ సీఈవో శ్రీనివాస్, ఏడీటీవోఐ ప్రెసిడెంట్ వేద్ ఖన్నా, విజయ్ మోహన్ , స్వామినాయుడు, మహాపాత్ర, టూర్ ఆపరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

# సంపూర్ణ ఆమోదం : సీఎం రేవంత్‌రెడ్డి

116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో కాంగ్రెస్ పార్టీకి అఖండ విజయాన్ని కట్టబెట్టారన్న రేవంత్... ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ విజయం లక్షలాది కాంగ్రెస్ కార్యకర్తల శ్రమ ఫలితమన్నారు. పార్టీ పట్ల వారికి ఉన్న అనంతమైన అభిమానానికి నిదర్శనమన్నారు. భుజాలు కాయలు కాసేలా పార్టీ జెండాను మోసి, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లిన ప్రతి కార్యకర్తకు ఈ విజయం అంకితమని పేర్కొన్నారు.

# నేటి నుంచి టోల్ మినహాయింపు

సౌకర్యం అందుబాటులో ఉంటుందని చెప్పారు. శ్రీశైలంలోని దేవస్థానం కమాండ్ కంట్రోల్ రూంలో ఎస్పీ సునీల్ షోరాణ్‌తో కలిసి గురువారం మాట్లాడారు. 'భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని విస్తృత స్థాయిలో సదుపాయాలు కల్పిస్తున్నాం. బ్రహ్మోత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటి వరకు 2,59,050 మంది భక్తులు దర్శనాలు చేసుకున్నారు. మహా శివరాత్రి రోజున సుమారు 1.50 లక్షల మంది భక్తులు విశ్రాంతి తీసుకునేలా అదనపు చలువ పందిళ్లు ఏర్పాటు చేస్తున్నాం. నంద్యాల-శ్రీశైలం మార్గంలో ప్రతి ఐదు నిమిషాలకు ఒక బస్సు నడుస్తోంది. ఏపీఎస్ఆర్టీసీ తరఫున 1,800, తెలంగాణ నుంచి 1,000, ఇతర ప్రాంతాల నుంచి వచ్చే బస్సులు కలిపి మొత్తం 3 వేల బస్సులు ఏర్పాటు చేశాం. ప్రభుత్వం చేపడుతున్న చర్యలకు, భద్రతా ఏర్పాట్లకు భక్తులు సహకరించాలి' అని కలెక్టర్ వివరించారు.

**వారి సమన్వయలోపం... నడకదారి భక్తులకు శాపం**

అటవీ, దేవాదాయశాఖల మధ్య సమన్వయలోపం భక్తులకు శాపంలా మారుతోంది. శ్రీశైలానికి నడక దారిలో వచ్చే భక్తులు నల్లమల అడవిలో 46 కి.మీ. దూరం నడవాలి. అందులో ఎలాంటి ఏర్పాట్లు చేయాలన్నా అటవీశాఖ అధికారులు మోకాలడ్డుతున్నారు. ఆ శాఖ పరిధిలో నడిచే భక్తులకు వారే అవసరమైన ఏర్పాట్లు చేయాల్సి ఉన్నప్పటికీ వారు చేయకపోగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తామన్నా అనుమతులు నిరాకరిస్తున్నారు. భక్తులకు ఏర్పాట్లు చేయడానికి దేవాదాయశాఖ ఏటా రూ.5 లక్షలు ఇస్తుండగా రూ.60 లక్షలు చెల్లించాలని అటవీశాఖ అధికారులు డిమాండు చేస్తుండటం గమనార్హం. దీనిపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

# ప్రజల విశ్వాసానికి చిహ్నం

ఫలితాల్లో 212 స్థానాల్లో విజయం సాధించినట్లు బీఎన్‌పీ ప్రకటించింది. 70 సీట్లకు పరిమితమైన జమాత్-ఏ-ఇస్లామీ పార్టీ ఓటమిని అంగీకరించింది. బీఎన్‌పీ నాయకుడు తారిఖ్ రహ్మాన్ తదుపరి ప్రధానిగా బాధ్యతలు చేపట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. అవినీతి కేసుల నేపథ్యంలో 17 ఏళ్ల క్రితం దేశం నుంచి వెళ్లిపోయిన రహ్మాన్ ఇటీవలే బంగ్లాదేశ్‌కు తిరిగొచ్చిన సంగతి తెలిసిందే. తల్లి జియా ఖాలిదా మరణంతో పార్టీ పగ్గాలను అందుకున్న ఆయన.. తాజా ఎన్నికల్లో బీఎన్‌పీని విజయం దిశగా నడిపించారు. దీంతో రెండు దశాబ్దాల తర్వాత ఈ పార్టీ మళ్లీ అధికారంలోకి రానుంది. ఇదిలాఉండగా.. బీఎన్‌పీ విజయంతో భారత్-బంగ్లా బంధం మళ్లీ బలపడే అవకాశాలు కన్పిస్తున్నాయి. ఈ పార్టీతో భారత్‌కు చెప్పుకోదగ్గ స్థాయిలో సంబంధాలు లేకపోయినా.. దాన్నొక ప్రజాస్వామ్య పార్టీగా చూస్తోంది. ఆ పార్టీతో సంబంధాలు పునరుద్ధరించుకునే సంకేతాలు ఇటీవల కాలంలో కన్పిస్తున్నాయి. రహ్మాన్ తల్లి జియా ఖాలిదా ఆ మధ్య తీవ్ర అనారోగ్యానికి గురికాగా.. ప్రధాని మోదీ నాడు ఆందోళన వ్యక్తం చేశారు. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా భారత్‌లో ఆశ్రయం పొందుతుండంతో ఇరుదేశాల మధ్య దౌత్యపరమైన విభేదాలు వచ్చిన సంగతి తెలిసిందే.

# అమెరికా యుద్ధ నౌకలు

యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ కరేబియన్ సముద్రం నుంచి ఇరాన్ వైపు కదిలినట్లు అంతర్జాతీయ మీడియా వర్గాలు వెల్లడించాయి. మే ప్రారంభం వరకు ఈ నౌక అక్కడే ఉండనున్నట్లు న్యూయార్క్ టైమ్స్ నివేదించింది. ఇరాన్ పాలకులపై ఒత్తిడి పెంచేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇప్పటికే అగ్రరాజ్యానికి చెందిన యుద్ధ విమాన వాహక నౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్‌ను పశ్చిమాసియాకు తరలించారు. తాజాగా జెరాల్డ్ ఆర్ ఫోర్డ్‌తో పాటు యూఎస్ఎస్ ఫ్రాంక్ ఈ పీటర్సన్ జూనియర్, యూఎస్ఎస్ ప్రూయాన్స్ డెస్ట్రాయర్లు, యూఎస్ఎస్ మిషెల్ మార్ఫీలను ఇరాన్ వైపు తరలిస్తుండడంతో అమెరికా ఏ క్షణాన దాడి చేస్తుందోనన్న భయాందోళనలు నెలకొన్నాయి. ఇటీవల అమెరికా వెనెజువెలాపై దాడి చేసి, మదురోను బంధించిన సమయంలోనూ యూఎస్ఎస్ జెరాల్డ్ ఆర్ ఫోర్డ్ విమాన వాహక నౌక నుంచే యుద్ధ విమానాలు దాడిలో పాల్గొన్నట్లు పలు నివేదికలు వెల్లడించాయి. ఒమన్ వేదికగా ఇరాన్, అమెరికా మధ్య పరోక్ష చర్చలు జరుగుతున్నాయి. ఒకవేళ ఈ చర్చలు విఫలమైతే దాడులకు దిగుతామని అగ్రరాజ్యం సంకేతాలిచ్చింది. ఈ నేపథ్యంలో యూఎస్ విమాన వాహక నౌక ఇరాన్ దిశగా కదలుతుండడం పశ్చిమాసియాలో ఆందోళనలు లేవనెత్తుతోంది.

# హసీనా అప్పగింతను కోరతాం : బీఎన్‌పీ

పాల్పడ్డారనే కేసుల్లో స్వదేశంలోని 'ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్' ఆమెకు మరణ శిక్ష విధించింది. వేరే ఇతర కేసుల్లోనూ ఆమెకు శిక్షలు పడ్డాయి. గతంలోనూ ఆమె అప్పగింతకు సంబంధించి అభ్యర్థనలు వచ్చాయి. హసీనాను అప్పగించాలని బంగ్లాదేశ్ చేసిన అభ్యర్థనను పరిశీలిస్తున్నామని భారత్ ఇప్పటికే చెప్పిన సంగతి తెలిసిందే. గురువారం జరిగిన బంగ్లాదేశ్ పార్లమెంట్ ఎన్నికల్లో బీఎన్‌పీ విజయం సాధించింది. మాజీ ప్రధాని ఖాలిదా జియా కుమారుడు తారిఖ్ రహ్మాన్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటు కానుంది. ఈ నేపథ్యంలోనే హసీనా గురించి ఆ పార్టీ స్పందించింది.

# ఇంకా నిర్ణయం తీసుకోలేదు..

ఫిబ్రవరి 19న జరిగే తొలి సమావేశానికి భారత్ హాజరవుతుందా, లేదా అన్నదానిపై మాత్రం స్పష్టత లేదన్నారు. ఈ సందర్భంగా పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం కోసం చేసే ప్రయత్నాలకు తాము నిరంతరం మద్దతు ఇస్తున్నామని పునరుద్ఘాటించారు. గాజాతో సహా మొత్తం ప్రాంతంలో శాశ్వత శాంతికి మార్గం సుగమం చేసే అన్ని కార్యక్రమాలను ప్రధాని మోదీ స్వాగతించారన్నారు. ఇక, స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా గత నెలలో ట్రంప్ ఈ శాంతిమండలిని ప్రారంభించారు. గాజాలో శాంతి నెలకొల్పేందుకు ఉద్దేశించి ఏర్పాటుచేసిన ఈ మండలికి ట్రంప్ ఛైర్మన్‌గా వ్యవహరించనున్నారు.

**మోదీ రాజకీయ భవిష్యత్తుపై ట్రంప్ వ్యాఖ్యల వీడియో.. స్పందించిన భారత్**

ప్రధాని మోదీ రాజకీయ జీవితంపై గతంలో ట్రంప్ చేసిన వ్యాఖ్యల వీడియో తాజాగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. దీనిపై రణధీర్ జైస్వాల్ స్పందించారు. 'నేను ఆ వీడియో చూడలేదు. అయితే ఆ వీడియో నిజంగా ఉంటే.. అది నిజమైనా, అబద్ధమైనా దానిపై తగిన చర్యలు తీసుకుంటాము' అని అన్నారు. రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడంపై గతేడాది భారత్‌పై ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో అధ్యక్షుడు వైట్‌హౌస్‌లో మాట్లాడుతూ.. ప్రధాని మోదీ గొప్ప వ్యక్తి అని ప్రశంసిస్తూనే.. 'ఆయన రాజకీయ భవిష్యత్తును నాశనం చేయడం ఇష్టం లేదు' అని వ్యాఖ్యానించారు. తాజాగా భారత్- అమెరికా మధ్య మధ్యంతర వాణిజ్య ఒప్పందం కుదిరిన నేపథ్యంలో ఈ వీడియో నెట్టింట వైరల్ అవుతుండటం గమనార్హం.

# గుండెపోటుతో వ్యక్తి మృతి

కుటుంబంతో సహా సేలానికి వచ్చాడు. కొంత కాలంగా అతడు గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నట్లు కుటుంబసభ్యులు వెల్లడించారు. మరోవైపు కరూర్ తొక్కిసలాట వంటి పరిస్థితులు తలెత్తకుండా విజయ్ ర్యాలీల్లో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. సేలంలో అనుమతి తీసుకున్న దానికంటే ఎక్కువమందిని నిర్వాహకులు అనుమతించడం వల్ల వేదిక ప్రాంగణం కిక్కిరిసిపోయిందని తెలిపారు. 5 వేల మందికి మాత్రమే పరిమితి ఉంటే.. దాదాపు 7వేల మందిని తరలించారని చెప్పారు. ఆ వ్యక్తి మృతికి గల కారణం తెలిసిన వెంటనే ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామన్నారు. కాగా గతేడాది సెప్టెంబర్‌లో కరూర్‌లో నిర్వహించిన విజయ్ ర్యాలీలో తొక్కిసలాట జరిగి.. 41 మంది ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

# వాలంటైన్స్ డే.. ఆ లింక్‌లపై క్లిక్ చేయొద్దు

అయ్యే ప్రమాదం ఉందని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖా గోయెల్ తెలిపారు. ఈ తరహా మోసాల పట్ల అత్యంత అప్రమత్తంగా ఉండాలని ఆమె సూచించారు.

మోసం ఎలా జరుగుతుంది?

సైబర్ నేరగాళ్లు నకిలీ డేటింగ్ లేదా సోషల్ మీడియా ప్రొఫైళ్లు క్రియేట్ చేసి మీ నమ్మకాన్ని పెంచుకొని డబ్బు అడుగుతారు.

వాలంటైన్స్ డే గిఫ్టులు, ఫ్లవర్ డెలివరీ, జ్యువెలరీ ఆఫర్లు, ఈవెంట్ టికెట్ వంటి లింకులు పంపిస్తారు.

ఈ లింక్‌లు నకిలీ పేమెంట్ వెబ్‌సైట్ లేదా హానికరమైన యాప్ డౌన్‌లోడ్‌కు దారితీస్తాయి.

గిఫ్ట్ డెలివరీ, కొరియర్ ఛార్జీలు లేదా అత్యవసరాల పేరుతో డబ్బు అడుగుతారు.

ఓటీపీలు, బ్యాంక్ వివరాలను షేర్ చేసుకున్నా లేదా హానికర యాప్‌లు ఇన్‌స్టాల్ చేసినా మీ పర్సనల్ డేటా, ఫైనాన్షియల్ డేటా చోరీకి గురవుతుంది.

**వెంటనే ఏం చేయాలి?**

మోసమేమోనని అనుమానం ఉన్నా.. లేదంటే మీరు ఏదైనా అనుమానాస్పద లింక్‌పై క్లిక్ చేసినా.. వెంటనే లావాదేవీలు నిలిపివేయండి.

ఓటీపీ, పిన్, సివివి లేదా వేరిఫికేషన్ కోడ్‌లను ఎవరికీ చెప్పొద్దు.

చాట్స్, లింక్‌లు, ట్రాన్సాక్షన్ వివరాల స్క్రీన్‌షాట్‌లను సేవ్ చేసుకోండి.

డబ్బు సంబంధిత విషయం ఉంటే వెంటనే బ్యాంక్ లేదా పేమెంట్ యాప్‌నకు సమాచారం ఇవ్వండి.

బ్యాంకింగ్, ఈ-మెయిల్, సోషల్ మీడియా పాస్‌వర్డ్‌లను వెంటనే మార్చండి.

**జాగ్రత్తలు & ఫిర్యాదు ఇలా..**

మీరు అలర్ట్‌గా ఉండండి.

తెలియని ప్రొఫైళ్ల నుంచి ఫ్రెండ్ రిక్వెస్ట్‌లను అంగీకరించవద్దు.

ఆన్‌లైన్‌లో పరిచయమైన వారికి డబ్బు పంపవద్దు.

వాలంటైన్స్ గిఫ్ట్ లేదా ఆఫర్ లింక్‌లపై క్లిక్ చేయొద్దు

లింక్ ద్వారా వచ్చే యాప్‌లను అస్సలు ఇన్‌స్టాల్ చేయకండి.

Two-Factor Authentication ఉపయోగించండి.

అధికారిక వెబ్‌సైట్‌లు, యాప్ స్టోర్‌ల ద్వారా మాత్రమే చెల్లింపులు చేయండి.

మోసాలకు గురైతే వెంటనే 1930కి ఫిర్యాదు చేయండి.

# ఎడిటర్ వాయిస్

## తప్పు చేసిన వారిని శిక్షించండి.. వ్యవస్థకు మచ్చ తేవద్దు!

### 'కలెక్టర్ గారికి జర్నలిస్టు లోకం సూటి విన్నపం'

ఏ వ్యవస్థలోనైనా చీడపురుగులు ఉండటం సహజం. వారు చేసే తప్పుల వల్ల ఆ వృత్తికే మచ్చ వస్తుంటుంది. అయితే, ఆ తప్పులను సరిదిద్దాల్సిన బాధ్యత, అధికారం ఉన్న యంత్రాంగం.. నిర్దిష్టంగా తప్పు చేసిన వారిని శిక్షించాలి తప్ప, ఆ వృత్తిలో ఉన్న వారందరినీ దోషులుగా నిలబెట్టడం ఎంతవరకు సమంజసం? సరిగ్గా ఇప్పుడు కాకినాడ జిల్లా జర్నలిస్టులకు ఎదురైన వేదన ఇదే!

అక్రిడిటేషన్ల మంజూరు విషయంలో జర్నలిస్టు సంఘాలు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డబ్బులు వసూలు చేస్తున్నారని, డిమాండ్ చేస్తున్నారని సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ గారు పత్రికా ప్రకటన విడుదల చేయడం తీవ్ర కలకలం రేపింది. అవినీతిని అరికట్టాలన్న అధికారుల ఉద్దేశాన్ని ఎవరూ తప్పుబట్టరు. కానీ, ఒకరిద్దరు చేసే తప్పులకు మొత్తం జర్నలిస్టు లోకానికి, అన్ని పత్రికా సంఘాలకు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులందరికీ మచ్చ ఆపాదించేలా ఈ ప్రకటన ఉండటమే ఇక్కడ ప్రధాన అభ్యంతరం.

సమాజంలో జరిగే అన్యాయాలపై గళమెత్తుతూ, రేయింబవళ్లు కష్టపడే నిజమైన జర్నలిస్టుల ఆత్మగౌరవాన్ని ఈ ప్రకటన దెబ్బతీసింది. అక్రిడిటేషన్ల వ్యవహారంలో ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసి ఉంటే, పక్కా ఆధారాలతో వారిపై చట్టపరమైన, కఠిన చర్యలు తీసుకునే పూర్తి అధికారం జిల్లా యంత్రాంగానికి ఉంది. అవినీతిపరులను కటకటాల వెనక్కి నెడితే, దానికి పూర్తి జర్నలిస్టు సంఘాల మద్దతు కూడా నూటికి నూరు శాతం ఉంటుంది.

కానీ, అలా నిర్దిష్టమైన చర్యలు తీసుకోకుండా, "సంఘాలు, కమిటీ సభ్యులు డబ్బులు వసూలు చేస్తున్నారు" అని జనరలైజ్ చేసి అధికారికంగా పత్రికా ప్రకటన ఇవ్వడం ద్వారా.. ప్రజాక్షేత్రంలో పత్రికా రంగాన్ని, జర్నలిస్టులను ముద్దాయిలుగా నిలబెట్టినట్లు అయింది. ఈ పరిణామం వల్లే కాకినాడ జిల్లాలోని ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, జాఫ్, ఏపీజేఎఫ్, ఎపిఎంఎఫ్ వంటి సంఘాలతో పాటు ప్రెస్ క్లబ్ సభ్యులంతా అత్యవసరంగా జేఏసీగా ఏర్పడి మూకుమ్మడిగా ఖండించాల్సి వచ్చింది.

దోషులెవరో తేల్చి వారిపై చర్యలు తీసుకునేంత వరకు అక్రిడిటేషన్ కమిటీ సభ్యులంతా మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధపడటం వారి ఆవేదనకు అద్దం పడుతోంది. అధికారులకు, ప్రజలకు వారధిగా ఉండేది పత్రికా రంగమే. ఆ రంగానికి ప్రాతినిధ్యం వహించే జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతినకుండా చూడాల్సిన బాధ్యత యంత్రాంగంపై ఉంది.



కలెక్టర్ గారు వెంటనే స్పందించి, ఆ తప్పు చేసిన వ్యక్తులు ఎవరో బహిర్గతం చేయాలి. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి. తద్వారా పత్రికా రంగానికి ఉన్న గౌరవాన్ని, అక్రిడిటేషన్ కమిటీ ప్రతిష్టను కాపాడాలని 'విశ్వం వాయిస్' కోరుకుంటోంది.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




## బంగారం కోసం ఆటో డ్రైవర్ ఘాతుకం

**ఉపాధ్యాయురాలిపై కత్తితో దాడి.. - నగలతో పరారీ - గంటల వ్యవధిలో నిందితుడి అరెస్టు**



తీవ్రగాయాలైన ఉపాధ్యాయురాలిని 108లోకి ఎక్కిస్తున్న సిబ్బంది, స్థానికులు

**గూడూరు పట్టణం, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారం కోసం ఉపాధ్యాయురాలిపై ఆటోడ్రైవర్ కత్తితో దాడి చేయడంతో ఆమెకు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా గూడూరు మండలం చెమిర్తి సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు... గూడూరులోని అశోక్‌నగర్‌కు చెందిన ఉపాధ్యాయురాలు హరిత.. తిరుపతి జిల్లా బాలాయపల్లి మండలం గొట్టికాడు ప్రభుత్వ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నారు. రోజులాగే ఉదయం గూడూరులోని వాటర్‌ట్యాంకు వద్ద వెంకటగిరి వెళుతున్న ఆటో ఎక్కారు. అందులోని మిగిలిన ప్రయాణికులు మార్గంమధ్యలో చెన్నూరు, తిప్పవరప్పాడు వద్ద దిగేశారు. ఆమె ఒక్కరే ఉండడంతో చెమిర్తి సమీపంలో ఆటో డ్రైవర్ వాహనాన్ని ఆపి ఒక్కసారిగా ఉపాధ్యాయురాలి గొంతుపై, చేతిపైన కత్తితో దాడికి పాల్పడ్డాడు. ఆమె మెడలో ఒకటిన్నర సవర్ల బంగారం లాక్కొని, రోడ్డు పక్కన తోసేసి పరారయ్యాడు. రక్తగాయాలతో ఉన్న ఆమెను స్థానికులు గమనించి 108లో గూడూరు ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నెల్లూరుకు తరలించారు. డీఎస్పీ గీతాకుమారి ఆసుపత్రిలో బాధితురాలిని పరామర్శించిన తర్వాత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయురాలిపై దాడి చేసిన నిందితుడిని గంటల వ్యవధిలోనే అదుపులోకి తీసుకున్నట్లు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య ప్రకటించారు. నిందితుడిని అరెస్టు చేసి, ఆటో స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

## 12 మంది బాలికలను కరిచిన ఎలుకలు

**ఎ.కొండూరు కేజీబీవీ డార్మిటరీలో ఘటన - బాలికల నుంచి వాంగ్మూలం తీసుకుంటున్న మండల స్థాయి అధికారులు**



**ఎ.కొండూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** ఎన్టీఆర్ జిల్లా ఎ.కొండూరు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయలో చదువుకుంటున్న బాలికలు.. రోజూలాగే బుధవారం రాత్రి అక్కడి డార్మిటరీలో పడుకున్నారు. వారిలో ఏడో తరగతి చదువుతున్న 12 మంది బాలికలను ఎలుకలు కరిచాయి. గురువారం ఉదయమే విషయం తెలిసినా, విద్యాలయ అధికారులు గోప్యంగా ఉంచారు. బాధిత బాలికలకు చికిత్స చేయించేందుకు ఎ.కొండూరు పీహెచ్‌సీకి తరలించడంతో విషయం బయటకు వచ్చింది. సమాచారం అందగానే తహసీల్దార్ ఎన్.అరవింద్, ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, జీసీడీవో బి.విశ్వభారతి కేజీబీవీకి చేరుకొని బాలికల నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల మేరకు.. బుధవారం రాత్రి డార్మిటరీలో నిద్రిస్తున్న ఏడో తరగతి విద్యార్థినులు కావూరి కళావతి, చిమటా లక్ష్మీప్రసన్న, మాల్లాది శ్యామల, కె.శ్రీవర్షిత, బి.దీవెన, టి.కీర్తి, ఎస్.నవ్యశ్రీ, పి.ప్రణతి, ఎం.రజని, వి.స్నేహ తదితర 12 మందిని ఎలుకలు కరిచాయి. విషయం జిల్లా ఉన్నతాధికారులకు తెలియడంతో.. మండలస్థాయి అధికారులు అప్రమత్తమై కేజీబీవీకి చేరుకుని విచారించి స్థానిక పీహెచ్‌సీకి తరలించి వైద్యం చేయించారు. విద్యాలయంలో సత్వర చికిత్స అందించాల్సిన ఏఎన్‌ఎం పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. గతేడాది కూడా ఎలుకల సమస్య వచ్చినా.. ఇప్పటివరకు కిటికీల్లోంచి ఎలుకలు లోపలకు రాకుండా చర్యలు చేపట్టలేదు.

**మెరుగైన వైద్యం అందించాలి**

ఎలుకలు కరిచిన బాలికలకు అందిస్తున్న చికిత్సపై అధికారులతో మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడారు. మెరుగైన వైద్య సహాయం అందించాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఈ విషయాన్ని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

## ఉపాధి పోయిందని.. ఉసురు తీసుకున్నాడు



**మూసాపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉపాధి పోయిందని ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మృతుడి సంబంధీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా మనూరు మండలం కమలాపూర్‌కు చెందిన సంగోబ సంతోష్ యాదవ్ అలియాస్ శివ (29) కొన్నాళ్ల క్రితం హైదరాబాద్ నగరానికి వచ్చారు. శంషీగూడలోని ఇందిరాహిల్స్‌లో అద్దె ఇంట్లో ఉంటూ ప్రగతినగర్ రోడ్డులోని అంబీర్‌చెరువు కట్ట మీద పానీపూరీ బండి నిర్వహిస్తున్నారు. ఇటీవల హైడ్రా అధికారులు చెరువు పరిరక్షణలో భాగంగా ఆయా దుకాణాలను తొలగించి తటాకం చుట్టూరా కంచె నిర్మిస్తున్నారు. దీంతో తనకు ఉపాధి కరవైందని భావించిన సంతోష్ నాలుగు రోజులుగా తీవ్ర మానసిన వేదనకు గురయ్యాడు. ఈ నేపథ్యంలో మిత్రుడు శివాజీరావు గురువారం పలుమార్లు సంతోష్‌కు ఫోన్ చేసినా తీయలేదు. అనుమానం వచ్చిన అతడు సంతోష్ గదికి వెళ్లి చూడగా.. అప్పటికే ఉరి వేసుకుని విగతజీవిగా కన్పించారు.


## పల్నాడు జిల్లాలో దారుణం..

**తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కుమార్తె**

**సత్తెనపల్లి, విశ్వం వాయిస్ న్యూస్ :** పల్నాడు జిల్లాలో దారుణం చోటుచేసుకుంది. సత్తెనపల్లిలో కన్నతల్లిని కుమార్తె సజీవదహనం చేసింది. తల్లి రమాదేవి నిద్రపోయాక పెట్రోలు పోసి నిప్పంటించింది. ఈ నెల 8న ఈ ఘటన జరిగింది. పోలీసులు అనుమానాస్పద మృతిగా భావించి కేసు నమోదు చేశారు. దర్యాప్తులో ఇది హత్యగా తేలింది. కుటుంబ వివాదం నేపథ్యంలో ఈ ఘటన జరిగినట్లు వెల్లడైంది.

## పూజారి వేషంలో వచ్చి.. జైన మందిరాల్లో చోరీలు

**మహారాష్ట్రలో పట్టుబడ్డ ఘరానా దొంగ**



**చెన్నై (అన్నానగర్), విశ్వం వాయిస్ న్యూస్ :** ఎవరికీ అనుమానం రాకుండా పూజారి వేషంలో వచ్చి.. జైన మందిరాల్లో పెద్దఎత్తున చోరీలకు పాల్పడుతున్న ఘరానా దొంగను తమిళనాడు పోలీసులు మహారాష్ట్రలో అరెస్టు చేసి, చెన్నై తీసుకొచ్చారు. పోలీసులు గురువారం తెలిపిన వివరాల ప్రకారం.. గతేడాది ఫిబ్రవరి 14న చెన్నై యానైకవుని మింట్ వీధిలోని శ్రీచంద్రప్రభు జైన మందిరంలో భారీ చోరీ జరిగింది. 10 కిలోల వెండి కిరీటాలు, 600 గ్రాముల బంగారు పలకలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలించగా.. ముఖం కనిపించకుండా వస్త్రం కప్పుకుని, పూజారి వేషంలో ఓ వ్యక్తి ఆలయం నుంచి బయటకొచ్చి.. చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ వైపు వెళ్లినట్లు గుర్తించారు. రైలెక్కి ఎక్కడకు వెళ్లాడో తెలియకపోవడంతో పోలీసులు ఇతర రాష్ట్రాలకు ఆ దొంగ సమాచారాన్ని అందించారు. తరువాత హైదరాబాద్ కాచిగూడలోని జైన మందిరంలోనూ చెన్నై తరహా చోరీ జరిగింది. రెండు కేసులూ ఒకేలా ఉండటంతో చెన్నై పోలీసులు.. అక్కడి ఆధారాలతో కలిపి దర్యాప్తు చేసి, నిందితుడు పుణెకి చెందిన జీవన్‌సింగ్‌గా గుర్తించారు. పుణెలో జీవన్‌సింగ్‌ను అదుపులోకి తీసుకొని, అతన్నుంచి నగలు కొనుగోలు చేసిన వ్యాపారి రాజ్‌బహు రాథోర్‌ను సైతం అరెస్టు చేసి నవీ ముంబయిలోని బేలాపూర్ కోర్టులో హాజరుపరిచారు. జీవన్‌సింగ్‌ను బుధవారం చెన్నైకి తీసుకొచ్చారు. ఇతను తమిళనాడులోని సేలం, చెంగల్పట్టుతో పాటు కర్ణాటకలోని పలు జైన మందిరాల్లో చోరీలకు పాల్పడినట్లు తేలింది. పూజారి వేషంలో వెళ్లి దొంగతనాలు చేసేవాడని పోలీసులు తెలిపారు. నిందితుడిని చెన్నై కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

**పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో**


## ఏసీబీ సోదాలు.. డీటీ అరెస్టు



**పులివెందుల : విశ్వం వాయిస్ న్యూస్ :** కడప జిల్లా పులివెందుల ఆర్డీవో కార్యాలయంలో ఏసీబీ అధికారుల సోదాలు నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయంలో పనిచేస్తున్న డిప్యూటీ తహశీల్దార్ నాగేంద్ర ప్రసాద్ రూ.10వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కారు. చక్రాయపేట మండలం కుమారకాల్వ గ్రామంలో మశీదుకు సంబంధించి 36 ఎకరాల భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు కమిటీ సభ్యుల నుంచి డిప్యూటీ తహశీల్దార్ లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు కరీముల్లా ఏసీబీ అధికారులను ఆశ్రయించారు. శుక్రవారం ఆర్డీవో కార్యాలయంలో కరీముల్లా నుంచి నాగేంద్ర ప్రసాద్ రూ.10వేలు లంచం తీసుకుంటుండగా కడప ఏసీబీ డీఎస్పీ సీతారామారావు ఆధ్వర్యంలో బృందం పట్టుకుంది. నాగేంద్రప్రసాద్‌ను అరెస్టు చేసి కర్నూలు ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని ఏసీబీ డీఎస్పీ సీతారామారావు తెలిపారు.

**బాడీలో పేరుకుపోయిన**

## ఫ్యాట్, కేలరీలను కరిగించే శొంఠి..



మనం వంటల్లో ఎక్కువగా అల్లం వాడుతుంటాం. దీని వల్ల ఎన్నో లాభాలు ఉంటాయి. అయితే, అల్లంలో తాజా అల్లం, శొంఠి రెండు రకాలు ఉంటాయి. రెండూ కూడా ఆరోగ్యానికి మంచివి. తాజా అల్లాన్ని ఎక్కువగా వంటలకి వాడితే శొంఠిని మాత్రం మనం ఎక్కువగా ఏవైనా పనులు చేసేందుకు వాడతాం. వీటిని వాడడం వల్ల కలిగే లాభాలు ఏంటో ఇప్పుడు చూద్దాం. అల్లం అనేది మన వంటింట్లో ముఖ్యమైన పదార్థం. ఉదయం టీ చేయడం దగ్గర్నుంచీ వంటల వరకూ ఎన్నో రకాలుగా అల్లాన్ని వాడుతాం. దీనిని రుచి కోసమే కాకుండా ఆరోగ్య ప్రయోజనాల కోసం కూడా వాడొచ్చు. తాజా అల్లాన్నే కాకుండా, ఎండిన అల్లాన్ని కూడా మన ఆరోగ్యప్రయోజనాలకి వాడొచ్చు. దీని గురించి న్యూట్రిషనిస్ట్ లిమా మహాజన్ ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ వీడియోని షేర్ చేశారు. అందులోని వివరాలేంటో చూద్దాం. అసలు, ఈ శొంఠిని వాడడం వల్ల కలిగే లాభాలేంటో చూద్దాం.

**శొంఠిని ఎలా, ఎప్పుడు తీసుకోవాలి?**

న్యూట్రిషనిస్ట్ ప్రకారం, ఓ కప్పు వేడినీటిలో అరటీస్పూన్ పరిమాణంలో ఎండు అల్లం పొడి కలిపి తాగడం మంచిది. ఎక్కువ పరిమాణంలో తీసుకోవద్దు. అలా తీసుకుంటే వేడిచేస్తుంది. దీనిని ఎప్పుడైనా తీసుకోవచ్చు. అయితే, ఉదయాన్నే తీసుకుంటే మెటబాలిజం పెరిగి మైగ్రేన్స్, వికారం తగ్గుతుంది. భోజనం తర్వాత ఈ నీటిని తాగొచ్చు.

**శొంఠితో మెటబాలిజం పెరిగి బరువు తగ్గడం**

శొంఠితో తయారైన హెర్బల్ టీ తాగితే దాదాపు 90 నుంచి 110 కేలరీలు ఎక్కువగా బర్న్ అవుతాయని అధ్యయనాలు చెబుతున్నాయి. ఉదయమే శొంఠిని తీసుకోవడం వల్ల శరీరంలోని కొవ్వు 10 శాతం కరుగుతుంది. కొన్ని వారాల పాటు శొంఠిని రెగ్యులర్?గా తీసుకుంటే కిలో నుంచి కిలోన్నర వరకూ బరువు తగ్గుతారు. కేలరీలు, ఫ్యాట్ కరుగుతుంది.

**మైగ్రేన్, వికారం తగ్గడం**

ఎండిన అల్లం బరువు తగ్గడానికి మాత్రమే కాకుండా, నొప్పి, వికారం తగ్గడానికి హెల్ప్ అవుతుంది. మైగ్రేన్స్, వికారం తగ్గించడంలో అల్లం హెల్ప్ అవుతుంది. ప్రెగ్నెన్సీలో సర్జరీ తర్వాత వచ్చే వికారాన్ని తగ్గించడంలో శొంఠి బాగా పనిచేస్తుంది.

**శొంఠి ఎలా పనిచేస్తుంది?**

అల్లం ఎండబెట్టినప్పుడు, దానిలో ఉండే జింజెరాల్స్ అనే మూలకాలు షోగోల్స్?గా మారతాయి.

షోగోల్స్ ఎక్కువగా యాంటీ ఇన్‌ఫ్లమేటరీగా ఉంటాయి.

ఇవి బాడీలో వేడిని ఉత్పత్తి చేసి కేలరీలను బర్న్ చేస్తాయి.

అంతేకాకుండా బ్రౌన్ ఫ్యాట్ యాక్టివేట్ చేస్తాయి. కొవ్వుని కాల్చడంలో హెల్ప్ చేస్తాయి.

తాజా అల్లం కంటే ఎండిన అల్లాన్ని తీసుకుంటే మంచి బెనిఫిట్స్ అందుతాయి.




## రాత్రి నిద్రకు ముందు గ్రీన్ టీ ఎప్పుడైనా తాగారా?



తెల్లారగానే వేడివేడిగా తేనీటిని తాగకపోతే మనసంతా అదోలా ఉంటుంది. కాస్త కాఫీ లేదా టీ ఏదో వేడిగా గొంతు తడిపితే ఎంతో హాయిగా ఉంటుంది. వీటికి బదులుగా ఉదయం గ్రీన్ టీని తాగారనుకోండి.. ఆ రోజంతా ఉత్సాహంగా, ఉల్లాసంగా ఉంటారని అంటున్నారు నిపుణులు..

గ్రీన్ టీ తాగడం వల్ల ఎన్నో ఆరోగ్య సమస్యలు తొలగిపోతాయి. అందుకే చాలా మంది తమ ఉదయం 'గ్రీన్ టీ' తో ప్రారంభిస్తారు. గ్రీన్ టీ తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు నయమవుతాయి. అయితే చాలా మంది ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం ఎప్పుడుపడితే అప్పుడు వేళాపాళా లేకుండా గ్రీన్ టీ తాగుతుంటారు. ఈ టీలలో గ్రీన్‌టీకి బాగా ప్రాచుర్యం లభిస్తోంది. ఇందులో ఎన్నో ఆరోగ్యదాయిక గుణాలున్నాయి. ఆహారం అరుగుదల బాగుంటుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. వయసు మళ్లిన వారు కూడా చాలా ఉల్లాసంగా ఉంటారు. ముఖ్యంగా బరువు తగ్గాలనుకునే వారు పగటి పూట కంటే రాత్రిపూట ఆహారం తినకుండా ఉండాలనుకుంటే, గ్రీన్ టీ తాగడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల అనవసరంగా తినకుండా నిరోధించవచ్చు. అంతేకాకుండా ఎక్కువగా ఆహారం తినాలనే కోరికలను కూడా ఇది నివారిస్తుంది. వేడిగా ఈ పానీయంగా తాగడం వల్ల భోజనం అయిపోయిందని మెదడుకు సంకేతాలు అందుతాయి. దీనివల్ల స్వీట్లు, స్నాక్స్ లేదా ఇతర ఆహారాలు తినాలనే కోరిక క్రమంగా తగ్గుతుంది.

మీరు ఆరోగ్యంగా ఉండాలనుకుంటే, తక్కువ తినాలనుకుంటే రాత్రి భోజనానికి ముందు లేదా తర్వాత గ్రీన్ టీ తాగండి. ఇది బరువు తగ్గడంలో ఖచ్చితంగా సహాయపడుతుంది.

# చట్టాలు చుట్టాలు... 'ఇటుకల' రాజ్యశాసనం!

- కలెక్టరేట్ సాక్షిగా కాకినాడ నడిబొడ్డున యథేచ్ఛగా అక్రమ దందా
- రెవెన్యూ, మున్సిపల్, పోలీస్ చట్టాలు బేఖాతర్.. అధికారుల నిర్లక్ష్యపు నిద్ర
- ఇంద్రపాలెం టు గాంధీనగర్... వాహనదారులకు నిత్య నరకప్రాయం
- దుమ్ము, ధూళి, యాక్సిడెంట్లతో నెత్తురోడుతున్న రహదారి





"కలెక్టర్, ఎస్పీ గారూ..! మోటారు వాహనాల చట్టం, మున్సిపల్ చట్టం, రెవెన్యూ నిబంధనలు సామాన్యులకేనా? నిత్యం రోడ్లను ఆక్రమించి పబ్లిక్ న్యూసెన్స్ చేస్తున్న ఇటుకల మాఫియాకు ఈ చట్టాలు వర్తించవా? అక్రమార్కుల ముందు కాకినాడ జిల్లా యంత్రాంగం తలవంచిందా?"

– విశ్వం వాయిస్ సూటి ప్రశ్న

**కాకినాడ, (విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి):** దీపం ఉన్న చోటే చీకటి ఉంటుందన్న చందంగా కాకినాడ జిల్లా కేంద్రంలో అధికారుల పనితీరు తయారైంది. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ కార్యాలయానికి సమీపంలోనే ఇటుకల వ్యాపారుల రాజ్యశాసనం నడుస్తోంది. స్థానిక ఇంద్రపాలెం అంబేద్కర్ విగ్రహం నుండి గాంధీనగర్ వెళ్లే ప్రధాన రహదారి ఇప్పుడు వ్యాపారుల సొంత జాగీరుగా మారిపోయింది. రోడ్డుకు ఇరువైపులా ఎక్కడ పడితే అక్కడ ఇటుకల లారీలు, ట్రాక్టర్లు నిలిపివేసి ఏకంగా రోడ్డునే గోడౌన్‌గా మార్చేశారు. ఈ అక్రమ దందా బహిరంగంగా సాగుతున్నా.. మూడు కీలక శాఖల అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించడం వెనుక పెద్ద ఎత్తున అక్రమాలు జరుగుతున్నాయన్న అనుమానాలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి.

**వాహనదారుల ప్రాణాలతో చెలగాటం.. నిత్యం నరకమే!**

ఈ రహదారి గుండా ప్రయాణించాలంటేనే వాహనదారులు వణికిపోతున్నారు.

**స్కిడ్ అవుతున్న బైక్‌లు:** ఇటుకల లోడింగ్, అన్‌లోడింగ్ సమయంలో రాలే పొడి, మట్టి రోడ్డుపై పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు బ్రేక్ వేయగానే స్కిడ్ అయి కింద పడిపోతున్నారు.

**రాత్రి వేళల్లో మృత్యుద్వారాలు:** ఎలాంటి రిఫ్లెక్టర్లు, పార్కింగ్ లైట్లు లేకుండా రోడ్డును సగం వరకు ఆక్రమించి భారీ వాహనాలను నిలపడంతో.. రాత్రి పూట ఎదురుగా వచ్చే బండ్లు కనిపించక యాక్సిడెంట్లు జరుగుతున్నాయి. ఇప్పటికే ఇక్కడ ఎన్నో ప్రమాదాలు జరిగి నెత్తురోడినా అధికారులకు చీమ కుట్టినట్లు కూడా లేదు.

**ఆంబులెన్స్‌లకు సైతం అడ్డంకే:** ట్రాఫిక్ జామ్ కారణంగా అత్యవసర సమయాల్లో ప్రాణాపాయ స్థితిలో ఉన్న రోగులను తీసుకెళ్లే 108 ఆంబులెన్స్‌లు సైతం ఈ ఇటుకల బండ్ల వల్ల ముందుకు కదల్లేని పరిస్థితి నెలకొంది.

**చట్టాలున్నాయి.. అమలు చేసే నాథుడే లేడు!**

ప్రజా మార్గాలను ఆక్రమించడం చట్టరీత్యా నేరమని స్పష్టమైన చట్టాలు చెబుతున్నా, మున్సిపల్, రెవెన్యూ, పోలీసు విభాగాలు మౌన ముద్ర దాల్చాయి.

**పోలీస్/ట్రాఫిక్ శాఖ నిర్లక్ష్యం:** మోటారు వాహనాల చట్టం (ఎం.వి. యాక్ట్) సెక్షన్ 122 ప్రకారం పబ్లిక్ రోడ్డుపై ప్రమాదకరంగా వాహనాలు నిలపడం నేరం. అలాగే ఐపీసీ సెక్షన్ 283 (ప్రస్తుత భారతీయ న్యాయ సంహిత ప్రకారం) ప్రజా మార్గంలో ఆటంకం కలిగించడం (పబ్లిక్ న్యూసెన్స్) శిక్షార్హమైన నేరం. అయినా ట్రాఫిక్ పోలీసులు అప్పుడప్పుడూ వచ్చి తూతూ మంత్రంగా జరిమానాలు రాసి చేతులు దులుపుకుంటున్నారు తప్ప సెక్షన్ల కింద కఠిన కేసులు నమోదు చేయడం లేదు.

**మున్సిపల్ శాఖ మౌనం:** మున్సిపల్ కార్పొరేషన్ చట్టం ప్రకారం పబ్లిక్ రోడ్లు, ఫుట్‌పాత్‌లను కమర్షియల్ అవసరాలకు ఆక్రమిస్తే వెంటనే వాటిని తొలగించి, జరిమానాతో పాటు క్రిమినల్ కేసులు పెట్టాలి. కానీ టౌన్ ప్లానింగ్, శానిటేషన్ అధికారులు అటు వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు.

**రెవెన్యూ శాఖ ఉదాసీనత:** ప్రభుత్వ భూములు, ఆర్ అండ్ బీ రోడ్లను అక్రమంగా ఆక్రమిస్తే ఏపీ ల్యాండ్ ఎన్‌క్రోచ్‌మెంట్ చట్టం (1905) కింద చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది.

**ప్రజా దర్బార్ ఫిర్యాదులు బుట్టదాఖలు.. అంతా తూతూ మంత్రం!**

పన్నులు కట్టే సామాన్యుడికి రోడ్డు మీద నడిచే హక్కు లేకుండా పోయింది. ఈ ఆక్రమణలపై విసిగిపోయిన ప్రజలు 'ప్రజా దర్బార్'లో అధికారులకు ఎన్నిసార్లు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేసినా అవన్నీ బుట్టదాఖలవుతున్నాయి. పోలీసులు వచ్చినప్పుడు బండ్లను పక్కకు తీసి, మరుసటి రోజు ఉదయానికి మళ్లీ 'యథా రాజు.. యథా మంత్రి' అన్నట్లు రోడ్డును ఆక్రమిస్తున్నారు.

**కలెక్టర్ గారూ.. ఒక్కసారి ఆకస్మిక తనిఖీ చేయండి!**

"సామాన్యుడు నో పార్కింగ్‌లో బండి ఆపితే చలానాలు వేసే మీ యంత్రాంగం, రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తున్న ఇటుకల మాఫియాను ఎందుకు వదిలేస్తోంది? జిల్లా ఉన్నతాధికారుల కళ్లెదుటే ఈ బాగోతం జరుగుతున్నా కింది స్థాయి అధికారులు కప్పిపుచ్చుతున్నారంటే.. ఈ నిర్లక్ష్యం వెనుక ఎవరి అండదండలు ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు."

జిల్లా కలెక్టర్, ఎస్పీ గారు స్వయంగా స్పందించి ఒక్కసారి ఈ మార్గంలో ఆకస్మిక తనిఖీలు చేపట్టాలి. అక్రమ పార్కింగ్‌పై ఉక్కుపాదం మోపడంతో పాటు, విధుల్లో తీవ్ర నిర్లక్ష్యం వహించిన స్థానిక మున్సిపల్, రెవెన్యూ, పోలీస్ అధికారులపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో బాధితుల పక్షాన 'విశ్వం వాయిస్' ఆధ్వర్యంలో ప్రజలను కదిలించి పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టక తప్పదు.





# వైభవంగా ప్రారంభమైన కంబాల కబడ్డీ-సీజన్ 2

**ముఖ్య అతిథులుగా బిక్కిన, దాట్ల**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** జగ్గంపేట నియోజకవర్గం గోకవరం తంటికొండ రోడ్డులోని సిఎండి లే అవుట్ ప్రాంగణంలో కంబాల కబడ్డీ టోర్నమెంట్ సీజన్– 2 పలువురు భాజపా నాయకుల కోలాహలం మధ్య వైభవంగా ప్రారంభమయ్యాయి. కంబాల స్పోర్ట్స్‌అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 19 తేదీ వరకు చత్రపతి శివాజీ మహారాజ్ మెమోరియల్ టోర్నమెంట్ సీజన్ -2 నిర్వహిస్తున్నట్లు కంబాల తెలిపారు. గురువారం రాత్రి జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి భారతీయ జనతా పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు బిక్కిన విశ్వేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల కృష్ణవర్మ ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ముఖ్య అతిథులకు తీన్మార్ డబ్బులతో, బాణసంచ కాల్పులతో సిఎండి కార్యాలయం నుంచి కబడ్డీ ప్రాంగణం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. బిక్కిన, దాట్ల, కంబాల శ్రీనివాసరావు చత్రపతి శివాజీ చిత్రపటానికి పూలమాలవేసి, ఘనంగా నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలన చేశారు. దాట్ల కృష్ణవర్మ కబడ్డీ టోర్నమెంట్ను ప్రారంభించి, కోచ్‌లు టీం సభ్యులను పరిచయం చేసుకున్నారు.బిక్కిన టాస్ వేసి పోటీలను ప్రారంభించారు. ముఖ్య అతిథులు బిక్కిన,దాట్ల, కంబాల కబాడీ కుతకు వెళ్లి, క్రీడాకారుల్లో మరింత ఉత్సాహాన్ని నింపారు.క్రీడాకారులకు స్పోర్ట్స్ జాకెట్స్ ,గెలిపోందిన వారికి మెమొంటోల్ ను కంబాల శ్రీనివాసరావు అందజేశారు. ముఖ్య అతిథులకు కంబాల పూలమాలవేసి సాల్వతో ఘనంగా సత్కరిస్తూ చత్రపతి శివాజీ మేమెంటో అందజేశారు. ఈ కబడ్డీ పోటీలకు తూర్పుగోదావరి, కాకినాడ, పోలవరం మూడు జిల్లాల నుంచి క్రీడాకారుల అధిక సంఖ్యలో విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బిజెపి నాయకులు, కార్యకర్తలు, కంబాల అభిమానులు, క్రీడాకారులు, యువత తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదభరితంగా కేబుల్ వైర్లు ఉంటే చర్యలు తప్పవు : కమిషనర్ రంగారావు



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేట టౌన్ పరిధిలో స్తంభాలు పై ప్రమాద భరితంగా కేబుల్ వైరులు వేలాడదీస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమీషనర్ టీవీ రంగారావు హెచ్చరించారు. మండపేట పట్టణ కేబుల్ ఆపరేటర్లతో శుక్రవారం పురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ టీవీ రంగారావు సమీక్ష సమావేశం నిర్వహించారు.పట్టణంలోని ఆపరేటర్లు విచ్చలవిడిగా విద్యుత్ స్తంభాలకు వేలాడదీసిన మిగులు ఉన్న కేబుల్ వైర్లను వారం రోజుల్లోగా తొలగించాలన్నారు. లేని పక్షంలో పురపాలక సంఘ సిబ్బంది తొలగించి దానికైన ఖర్చుని వారికి జరిమానా విధిస్తామని స్పష్టం చేశారు. ఈ నిబంధన కచ్చితంగా అమలు చేయాలని కమిషనర్ కేబుల్ ఆపరేటర్లకు తెలిపారు.ఈ సమావేశంలో మున్సిపల్ ఇంజనీర్లు డి ఇ కే శ్రీనివాస్ , ఏ ఇ లు దాసరి పవన్, రెడ్డి అనూష లక్ష్మీ ,టౌన్ ప్లానింగ్ అధికారి కే రమ్య శ్రీ అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా ప్రారంభించిన అంగన్వాడీ కేంద్రం




**దేవీపట్నం, విశ్వంవాయిస్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం నియోజకవర్గం, దేవీపట్నం మండలం, దేవారం గ్రామపంచాయతీ పరిధిలోని పోతవరం గ్రామంలో నూతనంగా నిర్మించిన అంగన్ వాడీ కేంద్రం ఘనంగా దేవారం,శరభవరం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర చేతుల మీదుగా రిబ్బన్ కటింగ్ చేసి ప్రారంభించారు.శరభవరం దేవారం ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర మాట్లాడుతూ నూతనంగా ప్రారంభించిన అంగన్ వాడీ కేంద్రంలో గర్భిణీ స్త్రీలకు,బాలింతలకు,చిన్నారులకు ఇస్తున్న పౌష్టకాహారాన్ని సమయపాలన ప్రకారం వినియోగించుకోవాలని సూచించారు.అంగన్ వాడీ కార్యకర్తలు 0-6 సంవత్సరాల పిల్లలు, గర్భిణీలు మరియు పాలిచ్చే తల్లులకు పౌష్టికాహారం ముందస్తు విద్యాబోధన (ప్రీ-స్కూల్) ఆరోగ్య తనిఖీలు రోగనిరోధక టీకాలు మరియు వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ అంగన్వాడి కేంద్రాలు (ఐసిడిఎస్) ఆధ్వర్యంలో భాగంగా గ్రామీణ,పట్టణ ప్రాంతాలలో పోషకాహార లోపం నివారణకు పిల్లల అభివృద్ధికి కీలక పాత్ర పోషిస్తాయి.పోషకాహార పంపిణీ 6సంవత్సరాల పిల్లలకు ఆటపాటలతో కూడిన నాన్-పార్మల్ (ప్రీ-స్కూల్) విద్యను బోధించడం ఆరోగ్య సేవలు పిల్లలకు,తల్లులకు నెలవారీ బరువు తూకం వేయడం,ఆరోగ్య పరీక్షలు మరియు గర్భిణీలకు పిల్లలకు టీకా కార్యక్రమాలు నిర్వహించడంలో సహాయపడటం,పౌష్టికాహార లోపం నివారణ బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి వారికి ప్రత్యేక ఆహారాన్ని అవసరమైతే రిఫరల్ సేవలను అందించడం, మహిళల సాధికారతకు కేంద్రాలు పనిచేస్తాయని ఎంపీటీసీ తుర్రం జగదీష్ దొర అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి సూపర్వైజర్ అమ్మాజీ,ఏపీ ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్,భారత్ ఆదివాసీ పార్టీ డివిజన్ ప్రసార కార్యదర్శి చవలం విద్యాసాగర్,వార్డు మెంబరు కలుం వెంకన్న దొర,మండల ఎస్టీ కమిటీ చైర్మన్ సోదే వెంకన్న దొర,మడకం కృష్ణ దొర,కారం సత్యనారాయణ దొర,కారం కృష్ణ దొర,వార్డ్ మెంబర్ పండా రామలక్ష్మి,కారం రంగారావు దొర,మడకం వెంకటేష్ దొర,తుర్రం శివశంకర్ దొర,మడి మోహన్ దొర,మడి వెంకటలక్ష్మి,చవలం శాంతమ్మ,తుర్రం బాపనమ్మ,చోడి అఖిల్ దొర,మడకం సుధీర్ దొర,కంగాల గన్నేమ్మ,తుర్రం బుల్లమ్మ,తుర్రం అశ్విని దేవి,తుర్రం లోవ సత్య శ్రీ,,తుర్రం మణి కుమారి,కారం సుధా,కుంజం లక్ష్మి మరియు గ్రామ పెద్దలు,మహిళలు,యువతీ యువకులు,అంగన్వాడీ సిబ్బంది మొదలైన వారు పాల్గొన్నారు.

# ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం.. : ఎమ్మెల్యే ఆదిరెడ్డి

**దివ్యాంగురాలికి వీల్ చైర్ అందచేత**

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఒక దివ్యాంగురాలికి తాము ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నా మని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక 1వ డివిజన్ సుబ్బారావుపేటలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఇటీవల ప్రజా దర్బార్ నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఇదే ప్రజా దర్బార్ కు తిప్పాని శివ దుర్గ అనే దివ్యాంగురాలు రాగా ఆమె వద్దకు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెళ్లి మీ సమస్య ఏంటమ్మ అని అడగ్గా తనకు వీల్ చైర్ ఇప్పించాలని అభ్యర్థించింది. ఆమె అభ్యర్ధనపై స్పందించిన ఆయన తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున ఒక వీల్ చైర్ శివదుర్గకు ఈ రోజు తిలక్ రోడ్డులోని తన కార్యాలయంలో అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటువంటి దివ్యాంగులకు సేవ చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు. తమ భవానీ ఛారిటబుల్ ట్రస్టు తరపున ఇటువంటి సేవా కార్యక్రమాలను నిత్యం నిర్వహిస్తూనే ఉన్నామన్నారు. ప్రతి ఏటా అనేక మంది పేద విద్యార్థులకు వారి ఫీజు నిమిత్తం ఆర్థిక సహాయం చేయడం, అనారోగ్యంతో బాధపడే వారికి వైద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయం అందచేయడం జరుగుతోందన్నారు. అలాగే ఉచిత మెగా వైద్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందచేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కడలి రామకృష్ణ, కొయ్యల రమణ, బుడ్డిగ రవి, చల్లా బాలమురళి, మామిడి శ్రీను, ఏసు తదితరులు పాల్గొన్నారు.



# గంగవరం ఠాణాలో.. 'లంచా'వతారం!

**అడ్డంగా దొరికిన ఎస్సై వెంకటేష్, రైటర్ వీరబాబు.. - కుటుంబ గొడవలో బాధితుడిని పిండిన వైనం.. రూ. 15 వేలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కిన ఖాకీలు..**

**పోలవరం జిల్లా, గంగవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రక్షకభటులే భక్షకభటులుగా మారితే సామాన్యుడు ఎవరికి చెప్పుకోవాలి? న్యాయం చేయాల్సిన చేతులే లంచానికి చాపితే బాధితుడు ఎక్కడికి వెళ్లాలి? పోలవరం జిల్లా గంగవరం పోలీస్ స్టేషన్ వేదికగా గురువారం ఇదే జరిగింది. ఓ కుటుంబ తగాదా కేసులో కారును స్టేషన్‌కు తరలించిన పోలీసులు.. దానిని విడిచిపెట్టేందుకు 'రేటు' కట్టారు. రూ. 15 వేల కోసం కక్కుర్తి పడి ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు.

**బాధితుడికి 'పోలీస్' వేధింపులు..**

గంగవరం మండలం నెల్లిపూడి గ్రామానికి చెందిన ఓ వ్యక్తికి తన భార్య బంధువులతో గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో సదరు వ్యక్తి కారుపై ప్రత్యర్థులు దాడి చేశారు. న్యాయం జరుగుతుందని భావించిన బాధితుడి కారును గంగవరం పోలీసులు స్టేషన్‌కు తరలించారు. అక్కడితో ఆగకుండా, ఆ కారును తిరిగి ఇవ్వాలంటే రూ. 15 వేలు సమర్పించుకోవాల్సిందేనని ఎస్సై వెంకటేష్, రైటర్ వీరబాబులు హుకుం జారీ చేశారు.

**వల పన్ని.. పట్టుకొని..**

కుటుంబ సమస్యలతో సతమతమవుతున్న తనకు పోలీసుల తీరు మింగుడు పడలేదు. దీంతో ఆ బాధితుడు రాజమండ్రి ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. డీఎస్పీ డాక్టర్ కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో అధికారులు పక్కా వ్యూహం రచించారు. ఒప్పందం ప్రకారం గురువారం బాధితుడు రూ. 15 వేలు ఇస్తుండగా, ఎస్సై మరియు రైటర్‌పై ఏసీబీ అధికారులు మెరుపు దాడి చేశారు. లంచం తీసుకుంటూ సాక్ష్యాధారాలతో ఇద్దరూ దొరికిపోయారు.



**జిల్లాలో కలకలం..**

పోలీస్ స్టేషన్‌లోనే ఎస్సై స్థాయి అధికారి లంచం తీసుకుంటూ దొరికిపోవడం పోలవరం జిల్లాలో, ముఖ్యంగా రంపచోడవరం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. నిందితులను అరెస్ట్ చేశామని, శుక్రవారం ఏసీబీ కోర్టులో హాజరుపరుస్తామని డీఎస్పీ వెల్లడించారు. ప్రజలకు రక్షణగా నిలవాల్సిన పోలీస్ వ్యవస్థలో ఇలాంటి అవినీతి చీడపురుగులు ఉండటం దురదృష్టకరం. గంగవరం ఘటనతోనైనా అధికారుల్లో మార్పు రావాలి.

**అంతే కాకుండా ఎస్సైపై చాలా ఆరోపణలు అయితే ఉన్నాయి..**

గంగవరం ఏజెన్సీ నుండి ఏ వాహనం వచ్చినా డబ్బులు ఇవ్వనిదే వదిలే వాడు కాదని ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతంలో పండే దుంప లోడుతో వెళ్తున్న లారీ లను, అలాగే ఇతర లోడు తో వెళ్తున్న ప్రతీ వాహనాల యజమానుల నుండి లంచం తీసుకునే వాడని అక్కడ ప్రజలు తెలిపారు. దాంతో పాటుగా పోలీస్ స్టేషన్ కు వైన్ షాప్ దగ్గరగా ఉండడం తో మద్యం బాబులను కూడా బెదిరించే వాడని ఆరోపణలు గట్టిగా వినపడుతున్నాయి.




**సోమేశ్వరంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై**

# అధికారుల సమీక్ష సమావేశం



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మహా శివరాత్రి పురస్కరించుకుని సోమేశ్వరం శ్రీ బాల త్రిపుర సుందరీ సమేత శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో పటిష్టంగా ఏర్పాట్లు నిర్వహించాలని మండల తహశీల్దార్ బివి భాస్కర్ సూచించారు. ఈ మేరకు అధికారులతో శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మహా శివరాత్రి జాగరణ, జాతర వంటి ఏర్పాట్లకు చేయవలసిన ముందస్తు ఏర్పాటలపై దేవాదాయ శాఖ, పోలీస్, పంచాయితీ రాజ్, ఫైర్, రెవిన్యూ, విద్యుత్ శాఖాధికారులు ఉత్సవ కమిటీ సభ్యులతో కలిసి పలు విషయాలను చర్చించి, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది చేపట్టవలసిన చర్యలకు సూచనలు చేసారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ క్రికెట్ కప్ టోర్నమెంట్ ప్రారంభం

**యువత క్రీడల్లో రాణించి నగరానికి మంచి పేరు తేవాలి : మాజీ ఎంపీ భరత్, మాజీ రుడా చైర్మన్ షర్మిళారెడ్డి**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రంజాన్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ను మాజీ ఎంపీ భరత్, మాజీ రుడా చైర్మన్ షర్మిళ రెడ్డి స్థానిక రిజర్వు పోలీస్ గ్రౌండ్స్‌లో ఎంతో ఘనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైస్సార్సీపీ జాతీయ అధికార ప్రతినిధి మాజీ పార్లమెంట్ సభ్యులు మార్గాని భరత్ రామ్, మాజీ రుడా ఛైర్పర్సన్ మేడపాటి షర్మిల రెడ్డి విచ్చేసి టోర్నమెంట్ జట్లను పరిచయం చేసుకుని టాస్ వేసారు. మార్గాని భరత్ మాట్లాడుతూ యువత క్రీడల్లో రాణించి నగరానికి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మజ్జి అప్పారావు, వైస్సార్సీపీ నగర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ షబ్బీర్, యూత్ అడ్వైసర్స్ సయ్యద్ ఇర్షాద్, మొహమ్మద్ బషీర్, మొహమ్మద్ హస్సేన్, షరీఫ్, సయ్యద్, అల్తాఫ్ వైస్సార్సీపీ నాయకులు షేక్ సుభాని, మైనారిటీ సెల్ అధ్యక్షులు అరిఫుల్ల ఖాన్, యూనుస్ ఆర్గనైజర్స్ ముషు, షారూ, ఫీరోజ్, బబ్లు తదితరులు పాల్గొన్నారు.



# కోనసీమ ఉత్పత్తులకు గ్లోబల్ మార్కెట్ లక్ష్యం

## జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకాల ద్వారా కోనసీమ జిల్లాలోని స్థానిక కొబ్బరి, అరటి, కోకో ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో ప్రవేశం కల్పించి ఆర్థికాభివృద్ధి సాధించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ తెలిపారు. శుక్రవారం జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ 18వ సమావేశం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా 17వ సమావేశంలో పరిశ్రమల ప్రోత్సాహం, ఎగుమతుల పెంపు, ఎంఎస్ఎంఈ అనుమతులపై తీసుకున్న నిర్ణయాలను జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ అరుణ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఉత్పత్తుల ఎగుమతి సామర్థ్యాన్ని గుర్తించి, స్థానికంగా ఉత్పత్తి అవుతున్న అరటి, కొబ్బరి వంటి వ్యవసాయ ఉత్పత్తులను ఎగుమతుల దిశగా ప్రోత్సహించాలని సూచించారు. ఎగుమతుల పెంపు కోసం వ్యూహాలు రూపొందించడం, ఎగుమతిదారుల సమస్యలను పరిష్కరించడం, ఆర్థిక సహాయం అందించడం వంటి అంశాలపై చర్చించారు. ఒక జిల్లా--ఒక ఉత్పత్తి కార్యక్రమం అమలు పురోగతిని కూడా సమీక్షించారు. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈలు, ప్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్‌ల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం ఆ స్థలాలకు ఏపీఐఐసీ ద్వారా మౌలిక వసతులు కల్పించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఎంఎస్ఎంఈ పథకాల ద్వారా కొత్త పారిశ్రామికవేత్తలకు మార్గదర్శనం చేయాలని, కొత్త పరిశ్రమలకు అవసరమైన అనుమతులు, క్లియరెన్సులు ఏకగవాక్ష విధానంలో త్వరితగతిన మంజూరు చేయాలని తెలిపారు. కొత్తగా స్థాపించబడే యూనిట్ల ప్రతిపాదనల పరిశీలన, భూ కేటాయింపు, విద్యుత్, నీరు, కాలుష్య నియంత్రణ అనుమతుల సమన్వయంపై దృష్టి పెట్టాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి వద్ద పెండింగ్‌లో ఉన్న రెండు దరఖాస్తులను త్వరితగతిన క్లియర్ చేయాలని ఆదేశించారు. పరిశ్రమల విస్తరణ, ఆధునీకరణకు ఆర్థిక, సాంకేతిక సహాయం అందించాలని సూచించారు. టెక్నాలజీ అప్‌గ్రేడేషన్, డిజిటలైజేషన్, సబ్సిడీలు, రాయితీలు, ఇండస్ట్రియల్ పార్కుల అభివృద్ధి, ఎగుమతి సామర్థ్య పెంపు చర్యలపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఒక జిల్లా--ఒక ఉత్పత్తి కింద కొబ్బరి ఉత్పత్తులు, నేచురల్ బనానా ఫైబర్స్, క్వాయర్ ఉత్పత్తులు గుర్తించబడినట్లు తెలిపారు. వాల్యూ అడిషన్ శిక్షణలు, మార్కెట్ లింకేజీలు, పారదర్శక రుణాల మంజూరు, సింగిల్ విండో అనుమతుల పురోగతిపై సమీక్షించారు. ఏపీఐఐసీ ద్వారా సింగిల్ విండో సిస్టమ్ ఆన్‌లైన్‌లో అమలులో ఉందని, పరిశ్రమల అనుమతులు వేగవంతం కావడానికి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లను వినియోగించుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఉద్యాన శాఖ అధికారి బీవీ రమణ, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ రమణారెడ్డి, ఎంఎస్ఎంఈ డైరెక్టర్ అంబటి భూలక్ష్మి, ఏపీ ఇండస్ట్రియల్ బోర్డు సభ్యులు మట్టపర్తి భారతి, ఎల్డీఎం కేశవ వర్మ, సిడ్బి ప్రోగ్రాం అధికారి శ్రీనివాసరావు, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ సూర్యకళ, ఏపీ ఈపీడీసీఎల్ పర్యవేక్షణ ఇంజనీర్ బి. రాజేశ్వరి, డీపీఓ శాంతి తదితరులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై అప్రమత్తంగా ఉండాలి

## అమలాపురం డీఎస్పీ టిఎస్ ఆర్కె ప్రసాద్



విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా పరిధిలో సోషల్ మీడియా వినియోగంపై అప్రమత్తంగా ఉండాలని అమలాపురం డీఎస్పీ టి.ఎస్.ఆర్.కె. ప్రసాద్ సూచించారు. జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపీఎస్ ఆదేశాల మేరకు అమలాపురంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌ల దుర్వినియోగం, శాంతిభద్రతల సమస్యలపై వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు, సోషల్ మీడియా వినియోగదారులకు అవగాహన సమావేశం నిర్వహించారు. సమాజంలో శాంతి భద్రతలు కాపాడటంలో ప్రతి పౌరుడి బాధ్యత ఎంతో ముఖ్యమని, ముఖ్యంగా సోషల్ మీడియా వేదికల వినియోగంలో జాగ్రత్త అవసరమని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషల్ మీడియాలో వచ్చే ప్రతి పోస్ట్ సమాజంపై ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ప్రభావం చూపుతుందని వివరించారు. వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు తమ గ్రూపుల్లో జరిగే చర్చలు, షేర్ అయ్యే పోస్టులపై పర్యవేక్షణ వహించాలని సూచించారు. మత విద్వేషాలు రెచ్చగొట్టే సందేశాలు, అసత్య ప్రచారాలు, వ్యక్తులను అవమానించే వ్యాఖ్యలు వంటి అభ్యంతరకర విషయాలు గ్రూపుల్లో కనిపించిన వెంటనే వాటిని తొలగించి సంబంధిత వ్యక్తులను హెచ్చరించాలని తెలిపారు. గ్రూప్ అడ్మిన్ బాధ్యత కేవలం గ్రూప్ సృష్టించడమే కాకుండా అందులోని సమాచారాన్ని పర్యవేక్షించడం కూడా కాదని స్పష్టం చేశారు. నకిలీ వార్తల వ్యాప్తి సమాజంలో అపోహలు, ఉద్రిక్తతలు సృష్టించగలదని పేర్కొన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఏ సమాచారాన్నీ షేర్ చేయకూడదని, ఫార్వర్డ్ చేయడానికి ముందు నిజానిజాలు నిర్ధారించుకోవాలని సూచించారు. ఫేక్ న్యూస్ కారణంగా శాంతిభద్రతలకు విఘాతం కలిగితే సంబంధిత వ్యక్తులపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే వ్యక్తిగత దూషణలు, మహిళల గౌరవానికి భంగం కలిగించే పోస్టులు, అసభ్యకర వ్యాఖ్యలు, తప్పుడు ఆరోపణలు చేయడం వంటి చర్యలు ఐటీ చట్టం ప్రకారం శిక్షార్హమని తెలిపారు. సోషల్ మీడియా స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తే చట్టపరమైన చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా ప్రవర్తిస్తేనే సమాజంలో శాంతి, సౌహార్దత కొనసాగుతుందని అన్నారు. సమాజంలో అశాంతి సృష్టించే ప్రయత్నాలు ఎవరైనా చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. సోషల్ మీడియాను సమాచార మార్పిడికి, సామాజిక ప్రయోజనాలకు మాత్రమే వినియోగించాలని, దాన్ని తప్పుడు ప్రచారాలకు లేదా వేధింపులకు వేదికగా మార్చకూడదని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అమలాపురం సబ్ డివిజన్‌కు చెందిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్సైలు, పలువురు పోలీసు అధికారులు, వాట్సాప్ గ్రూప్ అడ్మిన్‌లు, సోషల్ మీడియా వినియోగదారులు పాల్గొన్నారు. సమావేశం ద్వారా సోషల్ మీడియా వినియోగంపై అవగాహన పెంపొందించడంతో పాటు చట్టపరమైన బాధ్యతలపై స్పష్టత కలిగిందని అధికారులు తెలిపారు.

# యువత పెడదారి పట్టకూడదు

## డ్రగ్స్, సైబర్ నేరాలపై ఎస్సై సురేష్ హెచ్చరిక




విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ ఆదేశాల మేరకు, రాజోలు సర్కిల్ ఇన్స్పెక్టర్ నరేష్ కుమార్ పర్యవేక్షణలో లక్కవరంలోని మంగేనా గురువయ్య కాలేజీలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మలికిపురం ఎస్సై సురేష్ పాల్గొని యువత పెడదారి పట్టకుండా ఉండేందుకు డ్రగ్స్ నిర్మూలన, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణ మరియు రోడ్డు భద్రతపై సమగ్రంగా అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, డ్రగ్స్ వల్ల భవిష్యత్తు నాశనం అవుతుందని ఆయన హెచ్చరించారు. గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాల గురించి సమాచారం తెలిసినా వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలపై వివరించి, ఎలాంటి ఆపద వచ్చినా భయపడకుండా 100 లేదా 112 నంబర్లకు కాల్ చేయాలని సూచించారు. సోషల్ మీడియాను బాధ్యతాయుతంగా వినియోగించాలని, అపరిచితులతో వ్యక్తిగత వివరాలు, ఫోటోలు పంచుకోవద్దని హెచ్చరించారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు. అలాగే వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ యాజమాన్యం, అధ్యాపకులు, పోలీస్ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలిగి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఎస్సై సురేష్ ఆకాంక్షించారు.

# కుండలేశ్వరంలో పర్యటించిన ఎస్పీ



కాట్రేనికోన, విశ్వం వాయిస్ న్యూస్ : డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమజిల్లా, కాట్రేనికోన మండలంలో కుండలేశ్వరంలో జిల్లా ఎస్పీ రాహుల్ మీనా శుక్రవారం మండల పరిధిలోని కుండలేశ్వరంలో పర్యటించారు. వృద్ధ గౌతమి నది తీరాన ఉన్న స్నాన ఘట్టాన్ని పరిశీలించారు. గజ ఈతగాలను అందుబాటులో ఉంచాలని, భక్తులు నదిలో లోతుకు వెళ్లకుండా చూడాలని నిర్వాహకులను ఆదేశించారు. అంతకుముందు కుండరేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ వెంట అమలాపురం డిఎస్పి టి ఎస్ ఆర్ కే ప్రసాద్, ముమ్మిడివరం సిఐ మోహన్ కుమార్, ఎస్సై అవినాష్, గోకరకొండ సత్యనారాయణ మూర్తి, పి ఎస్ ఎన్ రాజు, మోటేపల్లి శ్రీనివాస్, శివ, తో పాటు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

# శివరాత్రి వేళ తెలుగు రాష్ట్రాల భక్తులకు శుభవార్త.. శ్రీకాళహస్తిలోనూ..

శ్రీకాళహస్తి గిరి ప్రదక్షిణ రోడ్డును డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ప్రారంభించారు. వర్చువల్ విధానంలో దీనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా దేవాదాయశాఖ మంత్రి ఆనం రాంనారాయణ రెడ్డి సూచనతో త్వరలోనే శ్రీకాళహస్తి స్వామివారి దర్శనం చేసుకోనున్నట్లు స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధిక కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రస్తుతం తమిళనాడులోని అరుణాచలం దేవాలయంలో గిరి ప్రదక్షిణ చేసే అవకాశం ఉన్న విషయం తెలిసిందే. తెలుగు రాష్ట్రాల నుంచి వేలామంది మంది భక్తులు అరుణాచలం వెళ్తుంటారు. అక్కడ గిరి ప్రదక్షిణ నిర్వహించి అనంతరం స్వామివారిని దర్శించుకుంటారు. గిరి ప్రదక్షిణకు అరుణాచలం అనేది దక్షిణ భారతదేశంలో బాగా పాపులర్ అయిపోయింది. ఇక మహాశివరాత్రి సందర్భంగా అరుణాచలంలో గిరి ప్రదక్షిణకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. అయితే శ్రీకాళహస్తిలో కూడా గిరి ప్రదక్షిణకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. శ్రీకాళహస్తిలో నూతనంగా నిర్మించిన గిరిప్రదక్షిణ రోడ్డును డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయం నుంచి శుక్రవారం వర్చువల్‌గా ప్రారంభించారు. దాదాపు రూ.10 కోట్ల వ్యయంతో ఈ రోడ్డును నిర్మించారు. మహాశివరాత్రికి రెండు రోజుల ముందు ఈ గిరి ప్రదక్షిణ రోడ్డును ప్రారంభించడం ఆనందంగా ఉందని పవన్ స్పష్టం చేశారు.



శ్రీకాళహస్తిలో కూడా గిరి ప్రదక్షిణ

అరుణాచలం తరహాలో శ్రీకాళహస్తిలో కూడా ప్రతీ పౌర్ణమికి గిరి ప్రదక్షిణ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని పవన్ కళ్యాణ్ తెలిపారు. శివరాత్రి తర్వాత శ్రీకాళహస్తిలో గిరి ప్రదక్షిణ మార్గంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. 22 కిలోమీటర్లు ఉన్న ఈ గిరి ప్రదక్షిణ మార్గాన్ని ఆహ్లాదకరంగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రహదారికి రెండు వైపులా మొక్కలు నాటుతామని, అటవీశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టనున్నట్లు స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి గిరిప్రదక్షిణ చేస్తే కైలాసగిరి గిరిప్రదక్షిణ చేసిన పుణ్యంఫలం దక్కుతుందని, త్వరలో తాను కూడా శ్రీకాళహస్తిని దర్శించుకుంటానని అన్నారు.

**అరుచాలంలో గిరి ప్రదక్షిణ చేయాలని ఉంది**

అరుణాచలంలో గిరిప్రదక్షిణ చేయాలనే కోరిక తనకు కూడా ఉందని, అక్కడి గిరిప్రదక్షిణ గురించి తెలుసుకున్నట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. రాజకీయాలకు అతీతంగా ఆలయాలను రక్షించుకోవాల్సిన అవసరముందని, పాలకమండళ్లు బాధ్యతగా వ్యవహరిస్తే ఎలాంటి అపచారాలు జరగవన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమలలో ఎన్నో అపచారాలు జరిగాయని, అప్పటి పాలకమండలి బాధ్యతగా ఉంటే అవి జరిగేవి కాదన్నారు. తమ ప్రభుత్వంలో ఏర్పాటు అయిన ఆలయాల పాలకమండళ్లు బాధ్యతాయుతంగా పని చేయాలని సూచించారు. అటు కొటప్పకొండ ఆలయం పరిసర ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు వివరించారు. రాష్ట్రంలో పంచాయతీ రాజ్ నిధులతో 22 ప్రధాన దేవాలయలకు రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నట్లు పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాలను అభివృద్ధి చేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. దేవాలయాల పరిరక్షణకు తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో జరిగినట్లు తమ ప్రభుత్వంలో ఆలయాలపై దాడులు జరిగితే సహించేది లేదన్నారు.

# మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం



## 8 ఏళ్ల భరత్ అవయవదానం

విశ్వం వాయిస్ న్యూస్ జిల్లా ప్రతినిధి

అమలాపురం మండలం పేరూరు గ్రామంలో చోటుచేసుకున్న ఓ విషాద ఘటన మానవత్వానికి చిరస్మరణీయ ఉదాహరణగా నిలిచింది. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి బ్రెయిన్ డెడ్ అయిన ఎనిమిదేళ్ల బాలుడు బడుగు భరత్ మరణించినా, అతని తల్లిదండ్రులు తీసుకున్న గొప్ప నిర్ణయం పలువురి హృదయాలను కదిలించింది. కొద్ది రోజుల క్రితం జరిగిన రోడ్డు ప్రమాదంలో భరత్‌కు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని విశాఖపట్నంలోని ఆసుపత్రికి తరలించారు. వైద్యులు ఎంతగానో ప్రయత్నించినప్పటికీ, బాలుడు బ్రెయిన్ డెడ్ అయినట్లు ప్రకటించారు. ఈ విషాద సమయంలోనూ భరత్ తల్లిదండ్రులు అసాధారణ ధైర్యాన్ని ప్రదర్శించారు. తమ కుమారుడు శారీరకంగా దూరమైనా, అతని జీవం మరికొందరిలో కొనసాగాలని భావించి అతని అవయవాలను దానం చేయాలని నిర్ణయించారు. భరత్ కళ్లతో ఇద్దరికి చూపు లభించనుంది. అతని హృదయం, కిడ్నీలు, ఊపిరితిత్తులు అవసరమైన రోగులకు అమూల్యమైన ప్రాణదానంగా మారనున్నాయి. తమ కన్నుల పండువైన కుమారుడిని కోల్పోయిన దుఃఖంలోనూ, మరికొందరి జీవితాల్లో వెలుగులు నింపాలని ఆలోచించిన ఆ తల్లిదండ్రుల నిర్ణయం నిజంగా మానవత్వానికి ప్రతీకగా నిలిచింది. శుక్రవారం పేరూరు గ్రామంలో భరత్‌కు అంత్యక్రియలు నిర్వహించారు. గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు పెద్ద సంఖ్యలో హాజరై బాలుడికి చివరి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా భరత్ తల్లిదండ్రుల ధైర్యసాహసాలను ప్రశంసిస్తూ, వారి నిర్ణయం సమాజానికి ఆదర్శంగా నిలుస్తుందని గ్రామ పెద్దలు పేర్కొన్నారు. చిన్న వయస్సులోనే జీవితాన్ని వీడిన భరత్, తన అవయవాల ద్వారా మరికొందరి ప్రాణాల్లో చిరస్థాయిగా నిలిచాడు. కన్నీటి నడుమ తీసుకున్న ఆ నిర్ణయం, మానవత్వం ఇంకా బ్రతికే ఉందని మరోసారి చాటి చెప్పింది.

# మహిళా సాధికారత, దేశభక్తికి ప్రతీక

## సరోజిని నాయుడు జయంతి సందర్భంగా మంత్రి వాసంశెట్టి సుభాష్ నివాళులు



రామచంద్రపురం/అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ : భారత స్వాతంత్ర్య పోరాటంలో అపారమైన సేవలు అందించిన మహనీయురాలు, భారతదేశపు తొలి మహిళా గవర్నర్‌గా చరిత్రలో నిలిచిన కవయిత్రి సరోజిని నాయుడు జయంతి సందర్భంగా రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘన నివాళులు అర్పించారు. సరోజిని నాయుడు జీవితమే మహిళా సాధికారతకు, దేశభక్తికి ప్రతీక అని కొనియాడారు. స్వాతంత్ర్య సమరంలో ఆమె పోషించిన పాత్ర, భారత జాతీయ కాంగ్రెస్‌లో నాయకత్వం వహించిన తీరు, మహిళలను ఉద్యమాల వైపు ప్రేరేపించిన స్ఫూర్తిదాయక కృషి చిరస్మరణీయమని తెలిపారు. "నైటింగేల్ ఆఫ్ ఇండియా"గా ఖ్యాతి పొందిన సరోజినీ నాయుడు సాహిత్య సేవలు, దేశభక్తి గీతాలు యువతకు మార్గదర్శకమని మంత్రి సుభాష్ పేర్కొన్నారు. దేశ నిర్మాణంలో మహిళల పాత్ర ఎంతో కీలకమని ఆమె జీవిత చరిత్ర స్పష్టం చేస్తోందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. సరోజిని నాయుడు ఆశయాలు, విలువలను అనుసరిస్తూ సమాజ అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తామని ఒక ప్రకటనలో తెలిపారు.

# ఫ్రెండ్స్ ఫారెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం



అంబాజీపేట/అల్లవరం విశ్వం వాయిస్ న్యూస్ : అల్లవరం మండలం రెబ్బనపల్లి గ్రామం కొల్లు దీన ఆషిక 9 నెలలు పాప నరాల వైకాల్యంతో జన్మించింది. పాప తండ్రి లక్ష్మణ్‌కి శాస్త్ర వైద్య చికిత్స కోసం అంబాజీపేట మండలంకు చెందిన "ఫ్రెండ్స్ ఫారెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్" రాజమండ్రి రెయిన్బో హాస్పిటల్‌కి వెళ్లి 40000/ రూపాయలు ఆర్థిక సాయం శుక్రవారం అందజేయడం జరిగింది. ఫ్రెండ్స్ ఫారెవర్ హెల్పింగ్ ఆర్గనైజేషన్ సభ్యులను ప్రత్యేకంగా అభినందించారు.

# తెదేపా నాయకుడు గంటి సాయికి పుట్టినరోజు వేడుక



అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ : పి.గన్నవరం నియోజకవర్గం అంబాజీపేట మండలం పసుమెల్ల గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ నాయకుడు కార్యకర్త గంటి సాయి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం వక్కలంక బుల్లయ్య నివాస గృహంలో ఘనంగా నిర్వహించారు. ఎన్టీఆర్ యువసేన అధ్యక్షుడు బుల్లయ్య గంటి సాయి పూలదండలతో , దుస్సాలువాలతో గంటి సాయి బుల్లయ్య సత్కరించారు.

# ఘనంగా మహిళా జాతీయ దినోత్సవం

## సర్పంచ్ సునీతకి ఘన సన్మానం



అమలాపురం రూరల్/బండారులంక, విశ్వం వాయిస్ న్యూస్ : జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా అమలాపురం రూరల్ బండారులంక గ్రామ సర్పంచ్ పెనుమాల సునీత ఏడుకొండలు అధ్యక్షతన పలువురు మహిళలకు శుక్రవారం ఘనంగా సత్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ & మానిటరింగ్ సభ్యురాలు పుణ్య మంతుల రజిని, సర్పంచులు కుడుపూడి రామలక్ష్మి, తిరుకోటి సత్యవతి, ఫీల్డ్ అసిస్టెంట్ భారతి, మామిడిశెట్టి చంద్ర, గుమస్తా సత్యనారాయణ రాజు, బిల్ కలెక్టర్ రాంబాబు, పంచాయితీ ససువాలయం సిబ్బంది ఏఎన్ఎంలు గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యార్థులు సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై

# అవగాహన కలిగి ఉండాలి : కాట్రేనికోన ఎస్సై అవినాష్



కాట్రేనికోన, విశ్వంవాయిస్ న్యూస్ : డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ రాహుల్ మీనా ఐపిఎస్ ఆదేశాల మేరకు, అమలాపురం డిఎస్పి టీఎస్ ఆర్కే ప్రసాద్, ముమ్మిడివరం సర్కిల్ ఇన్స్పెక్టర్ మోహన్ కుమార్ పర్యవేక్షణలో, ఈరోజు కాట్రేనికోన గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాట్రేనికోన ఎస్సై అవినాష్ పాల్గొని సైబర్ క్రైమ్స్, రోడ్డు భద్రత, మరియు మహిళలు, చిన్నారులపై జరుగుతున్న నేరాల గురించి విద్యార్థులకు క్లుప్తంగా వివరించారు. సైబర్ నేరాలు సోషల్ మీడియా వాడకంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, తెలియని వ్యక్తుల నుంచి వచ్చే లింక్‌లను క్లిక్ చేయకూడదని, వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దని ఎస్సై హెచ్చరించారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. రోడ్డు భద్రత మైనర్లు వాహనాలు నడపకూడదని, రహదారి నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను అరికట్టవచ్చని తెలిపారు. హెల్మెట్ ధరించడం మరియు అతివేగాన్ని నియంత్రించుకోవడంపై అవగాహన కల్పించారు. మహిళలు, చిన్నారుల రక్షణ మహిళలు మరియు చిన్నారుల భద్రత కోసం ప్రభుత్వం తీసుకువచ్చిన చట్టాల గురించి వివరించారు. ఏదైనా ఆపద కలిగితే 100 లేదా 112'నంబర్లకు సమాచారం అందించాలని కోరారు. గుడ్ టచ్ – బ్యాడ్ టచ్' పట్ల చిన్నారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, పోలీస్ సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



## అందరికీ మకిలా?

# కలెక్టర్ తీరుపై భగ్గుమన్న జర్నలిస్టు లోకం!

- తప్పు చేసిన వారిని శిక్షించండి.. అందరిపై నెపమా?
- కలెక్టర్ పత్రికా ప్రకటనపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసిన మీడియా సంఘాలు
- మూకుమ్మడి రాజీనామాలకు సిద్ధమైన అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు
- కాకినాడలో అత్యవసరంగా సమావేశమైన జేసీసీ.. తదుపరి కార్యాచరణపై కసరత్తు

"అక్రిడిటేషన్ల కోసం ఎవరైనా డబ్బులు డిమాండ్ చేస్తే వాళ్లపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోండి. అంతేతప్ప, బాధ్యతాయుతంగా పనిచేస్తున్న జర్నలిస్టు సంఘాలకు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులందరికీ ఆ మచ్చ ఆపాదించడం తగదు. కలెక్టర్ వెంటనే దీనిపై వివరణ ఇవ్వాలి."

– జర్నలిస్టు సంఘాల జేఏసీ ఏకగ్రీవ తీర్మానం



**కాకినాడ (విశ్వం వాయిస్ ప్రత్యేక ప్రతినిధి) :** కాకినాడ జిల్లా కలెక్టర్ ఈనెల 12న విడుదల చేసిన ఒక పత్రికా ప్రకటన జిల్లా వ్యాప్తంగా జర్నలిస్టుల మనోభావాలను తీవ్రంగా దెబ్బతీసింది. అక్రిడిటేషన్ల మంజూరు కోసం జర్నలిస్టు సంఘాలు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు డబ్బులు వసూలు చేస్తున్నారని, డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ కలెక్టర్ ఇచ్చిన ప్రకటనపై మీడియా వర్గాలు తీవ్రస్థాయిలో మండిపడ్డాయి. అందిన పిర్యాదులపై విచారణ చెప్పటకుండా, మొత్తం జర్నలిస్టు లోకానికి మచ్చ తెచ్చేలా కలెక్టర్ వ్యవహరించడాన్ని ముక్తకంఠంతో ఖండించాయి.

**కాకినాడలో అత్యవసర జేఏసీ సమావేశం**

కలెక్టర్ ప్రకటనను తీవ్రంగా పరిగణించిన కాకినాడ జిల్లాలోని జర్నలిస్టు సంఘాలు శుక్రవారం (ఫిబ్రవరి 13) అత్యవసరంగా సమావేశమయ్యాయి. ఏపీయూడబ్ల్యూజే, ఏపీడబ్ల్యూజేఎఫ్, జాఫ్, ఏపీజేఎఫ్, ఎపిఎంఎఫ్ సంఘాల అధ్యక్షులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, కలెక్టర్ నామినేట్ చేసిన సభ్యులు, చిన్న, మధ్యతరహా పత్రికల అసోసియేషన్ ప్రతినిధులు, కాకినాడ ప్రెస్ క్లబ్ సభ్యులు జేఏసీగా ఏర్పడి పలు కీలక అంశాలపై చర్చించారు.

**జేఏసీ ఏకగ్రీవ తీర్మానాలు, డిమాండ్లు:**

ఈ సమావేశంలో కలెక్టర్ తీరును ఏకగ్రీవంగా ఖండిస్తూ జర్నలిస్టు సంఘాలు పలు కీలక తీర్మానాలు చేశాయి:

**వివరణ ఇవ్వాలి:** జర్నలిస్టుల మనోభావాలు దెబ్బతినేలా చేసిన ఈ ప్రకటన పొరపాటున జరిగిందా? లేక ఉద్దేశపూర్వకంగా చేశారా? అన్నది కలెక్టర్ వెంటనే స్పష్టం చేయాలి.

**దోషులను తేల్చాలి:** అక్రిడిటేషన్ల పేరుతో నిజంగా ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసి ఉంటే, వారిపై తక్షణమే విచారణ జరిపి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలి. దానికి జర్నలిస్టు సంఘాల పూర్తి మద్దతు ఉంటుంది.

**మూకుమ్మడి రాజీనామాలు:** దోషులెవరో తేల్చి చర్యలు తీసుకునేంత వరకు.. అక్రిడిటేషన్ కమిటీ సభ్యులంతా తమ పదవులకు మూకుమ్మడిగా రాజీనామా చేయాలని సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించింది.

**వినతిపత్రం:** ఈ మొత్తం వ్యవహారంపై లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు.

**తదుపరి కార్యాచరణకు సన్నద్ధం:**

కలెక్టర్ స్పందనను బట్టి తదుపరి కార్యాచరణను ప్రకటించడానికి అన్ని జర్నలిస్టు సంఘాలు, ప్రెస్ క్లబ్ సభ్యులు మరోసారి సమావేశం కావాలని నిర్ణయించారు. ఈ అత్యవసర సమావేశంలో జర్నలిస్ట్ సంఘాల ప్రతినిధులు, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులైన ఎస్.కె దుర్రానీ, వి.నవీన్ రాజ్, వి.సాయినాథ్, శివన్నారాయణ రెడ్డి, త్రిమూర్తులు, కోనేటి శ్రీనివాస్, ముమ్మిడి లక్ష్మణ్, గునిపే శోభన్ బాబు, అంజి బాబు, కృష్ణంరాజు, పురె త్రినాధ్, దుర్గారావు, ప్రెస్ క్లబ్ అధ్యక్షులు రాజేష్, కనకాద్రి తదితరులు పాల్గొన్నారు.

# పదిలో ప్రథమం వస్తే పదివేలు బహుమతి...!



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం పదోతరగతి చదువుతున్న విద్యార్థులకు మంచి బహుమతుల అవకాశం ఇది. శంఖవరం మండల పరిధిలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు 2026 వార్షిక పరీక్షల్లో శంఖవరం మండల స్థాయిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు శ్రీ సాయి సత్య దేవా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేయ నున్నది. ఈ మేరకు అసోసియేషన్ నిర్వాహకులు, విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు శుక్రవారం మీడియా ప్రకటనను విడుదల చేశారు. ఈ ఏడాది పదోతరగతి వార్షిక పరీక్షల్లో మండల స్థాయిలో విశేష ప్రతిభ కనబరిచిన ముగ్గురు విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ. 10,000, ద్వితీయ బహుమతిగా రూ. 7,500, తృతీయ బహుమతిగా 5,000 లు చొప్పున నగదును జనసేన పార్టీ కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ద్వారా పంపిణీ చేసి, ఘనంగా సత్కరిస్తామని నాగేశ్వరరావు తెలిపారు. కేవలం విద్యార్థి ప్రతిభామూర్తులనే కాకుండా వారికి విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను, విద్యార్థులను తీర్చిదిద్దిన తల్లి దండ్రులను కూడా కాకినాడ పార్లమెంట్ సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ద్వారా సత్కరిస్తామని కొంతంగి జనసేన పార్టీ అధ్యక్షుడు, శ్రీ సాయి సత్య దేవా సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్వాహకులు, విజయవాడ డివిజనల్ రైల్వే వినియోగదారుల సంప్రదింపుల కమిటీ సభ్యులు గొర్లి నాగేశ్వరరావు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## ప్రత్తిపాడు వైసీపీ సోషల్ మీడియా అధ్యక్షులుగా

# గొంతిరెడ్డి సతీష్ నియామకం



**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా గొంతిరెడ్డి సతీష్ నియమితులు అయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధినాయకత్వం కార్యాచరణను పూర్తి చేసి గురువారం వివరాలను వెల్లడించింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని ఆ పార్టీ నియోజకవర్గం ఇంచార్జ్ ముద్రగడ గిరిబాబును శుక్రవారం గొంతిరెడ్డి సతీష్ మర్యాదపూర్వకంగా కలిసారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్రెడ్డి ఆదేశాల మేరకు ప్రత్తిపాడు నియోజకవర్గ వైసిపి ఇంచార్జి ముద్రగడ గిరిబాబు సూచనలతో ప్రత్తిపాడు నియోజకవర్గ సోషల్ మీడియా వింగ్ అధ్యక్షులుగా తనను నియమించినందుకు గిరిబాబుకు సతీష్ కృతజ్ఞతలు తెలిపారు. నాపై నమ్మకంతో నాకు అప్పగించిన ఈ బాధ్యతను సక్రమంగా నిర్వహిస్తూ, పార్టీ నాయకుల సహకారంతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. నాకు ఈ అవకాశం కల్పించిన గురు వర్యులు ముద్రగడ పద్మనాభంకు, ఇంచార్జి ముద్రగడ గిరిబాబుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపు తున్నానని ఈ సందర్భంగా గొంతిరెడ్డి సతీష్ మీడియాకి తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర వైసీపీ యువజన విభాగ కార్యదర్శి బదిరెడ్డి గోవింద్, యువ నాయకులు సిరిపురపు రాజేష్, లోగీసు శేఖర్, దత్తి రాజా, భీశెట్టి రాజా, బంటుమిల్లి శ్రవణ్, సూతి ప్రసన్న, భీశెట్టి స్వామి, బుద్ద గణేష్, గాది చిన్నా తదితరులు సతీష్ కి శుభాకాంక్షలు తెలిపారు.

# టీడీపీ మండల అధ్యక్షులు, కార్యదర్శుల శిక్షణలో కుడిపూడి నిర్దేశం

## నాయకత్వ పటిష్టత, క్షేత్రస్థాయి వ్యూహంతో టీడీపీ పార్టీ బలోపేతం : రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు



**మంగళగిరి, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలుగుదేశం పార్టీని క్షేత్రస్థాయిలో మరింత శక్తివంతంగా తీర్చిదిద్దేందుకు రూపొందించిన శాస్త్రీయ వ్యవస్థను సమర్థంగా అమలు చేయాలని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు పిలుపు నిచ్చారు. అమరావతిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం లో నిర్వహించిన మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల శిక్షణ తరగతుల్లో ఆయన పాల్గొని దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్టీని జాతీయ స్థాయిలో రాజకీయ యంత్రాంగంగా నిలబెట్టడంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, యువ నాయకుడు నారా లోకేష్ అకుంఠిత దీక్ష ప్రధాన పాత్ర పోషించాయని పేర్కొన్నారు. అత్యుత్తమ పార్టీ నిర్మాణం టీడీపీకి ప్రత్యేకమైన, శాస్త్రీయమైన మరియు క్రమబద్ధమైన సంఘటనా నిర్మాణం ఉందని సత్తిబాబు వివరించారు. ఇతర పార్టీలతో పోలిస్తే క్షేత్రస్థాయిలో టీడీపీ వ్యవస్థ మరింత పటిష్టంగా ఉందన్నారు.

**క్లస్టర్ , యూనిట్, బూత్ వ్యవస్థ:**

గ్రామ స్థాయి నుంచి పై స్థాయి వరకు సమన్వయంతో పనిచేసే విధంగా ప్రత్యేక నిర్మాణాన్ని రూపొందించారని తెలిపారు. కె ఎస్ ఎస్ (కుటుంబ సాధికార సారథి) వ్యవస్థ: ప్రతి 60 ఓట్లకు ఒక కె.ఎస్.ఎస్.నియామకం ద్వారా ఇంటింటికీ పార్టీ చేరువవుతోందన్నారు.

**బూత్ అండ్ యూనిట్ ఇంఛార్జ్ వ్యవస్థ:** ప్రతి 1000 ఓట్లకు ఒక బూత్ ఇంఛార్జ్, ప్రతి 5000 ఓట్లకు ఒక యూనిట్ ఇంఛార్జ్ నియామకం ద్వారా పర్యవేక్షణను మరింత పకడ్బందీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండల నాయకత్వమే కీలక బలం ఈ పటిష్టమైన వ్యవస్థను విజయవంతం చేయడంలో మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శుల బాధ్యత అత్యంత కీలకమని స్పష్టం చేశారు. నాయకత్వం ఇచ్చిన ఈ అద్భుతమైన స్ట్రక్చర్‌ను సమర్థంగా అమలు చేస్తూ, క్షేత్రస్థాయిలో పార్టీకి తిరుగులేని విజయాలను సాధించేందుకు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. చంద్రబాబు విజన్, లోకేష్ ప్రణాళికాబద్ధమైన కార్యాచరణ వల్లనే టీడీపీ నేడు శక్తివంతమైన కేడర్ బేస్డ్ పార్టీగా నిలిచింది. ఈ నిర్మాణాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి మరింత బలోపేతం చేయాల్సిన బాధ్యత మండల నాయకత్వానిదే,"అని కుడుపూడి సత్తిబాబు పేర్కొన్నారు.

# రామాలయానికి రూ.15,000 విలువైన మైక్ సెట్ ...!





**రౌతులపూడి, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం రౌతులపూడి మండలం లచ్చిరెడ్డిపాలెం శ్రీ సీతారామ ఆలయానికి రూ. 10,116 లను ఆలయ కమిటీ సభ్యులకు జిల్లా భారతీయ జనతా పార్టీ పూర్వ అధ్యక్షుడు చిలుకూరి రాంకుమార్ విరాళంగా గురువారం అందజేశారు. ఆలయ అభివృద్ధికి ఎల్లప్పుడూ తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. అదేవిధంగా సీతారామ ఆలయానికి రూ.15,000 విలువైన మైక్ సెట్‌ను కూడా అందజేస్తానని హామీ ఇచ్చారు. అలాగే ఎస్.అగ్రహారం గ్రామానికి చెందిన యాదవులు శ్రీకృష్ణ మందిరంలో కీర్తనలు, భగవద్గీత కార్యక్రమాలు గ్రామమంతా వినిపించే విధంగా మైక్ సెట్లు ఉపయోగించు కుంటామని తెలిపారు. వారికి కూడా హామీ ఇచ్చారు. ఈ సేవా కార్యక్రమాల పట్ల గ్రామ ప్రజలు అందరూ రామ్ కుమార్ కు కృతజ్ఞతలు తెలిపారు. పలు గ్రామాల్లోని హిందూ మత దేవాలయాలకు మైక్ సెట్లు విరాళంగా అందించడం, అవసరమైన వారికి ఆర్థిక సహాయం అందించడం వంటి సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తూ గ్రామాల్లో ఆధ్యాత్మిక చైతన్యం, సామాజిక ఐక్యత మరింత బలోపేతం చేసే దిశగా చిలుకూరి రాంకుమార్ తన వందేమాతరం ఫౌండేషన్ ద్వారా ఇతోధిక సేవలను అందిస్తున్నారు. మైక్ సెట్ల బహుకరణ, ఆర్థిక సహాయాలతో గ్రామాల్లో సేవా స్ఫూర్తిని చిలుకూరి రాంకుమార్ చాటుతున్నారు. తుని తపోవనం పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ సచ్చిదానంద సరస్వతి స్వామీజీ శుక్రవారం సిద్ది పొందారు. స్వామిజీ అంత్యక్రియల్లో పాల్గొన్న రామ్ కుమార్ స్వామిజీకి ఘన నివాళులను అర్పించారు.

# చేతివృత్తుల కళాకారుల నైపుణ్యానికి అద్దం పట్టిన ప్రదర్శన

## - పిఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్-కమ్-ట్రేడ్ ఫెయిర్ ప్రారంభం - ఫిబ్రవరి 12,13,14 తేదీల్లో..



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** భారత ప్రభుత్వ ఎంఎస్ఎంఈ మంత్రిత్వ శాఖకు చెందిన ఎంఎస్ఎంఈ-డిఎఫ్ఓ, విశాఖపట్నం మరియు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న మూడు రోజుల 'పిఎం విశ్వకర్మ ఎగ్జిబిషన్-కమ్-ట్రేడ్ ఫెయిర్' గురువారం రాజమండ్రిలో ఘనంగా ప్రారంభించడం జరిగిందనీ ఎంఎస్ఎంఈ-డిఎఫ్ఓ, విశాఖపట్నం జాయింట్ డైరెక్టర్ ఆర్. సెంథిల్ కుమార్ పేర్కొన్నారు. గురువారం దానవాయిపేట లోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరుగుతున్న ఈ ప్రదర్శన ఫిబ్రవరి 12, 13, 14 తేదీలలో ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి రాత్రి 7.30 గంటల వరకు కొనసాగనుంది. ఈ సందర్భంగా జాయింట్ డైరెక్టర్ ఆర్. సెంథిల్ కుమార్ మాట్లాడుతూ, ప్రదర్శనలో 50కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేసి, హస్తకళలు, కొబ్బరి పీచు ఉత్పత్తులు, కొబ్బరి చిప్పలతో తయారైన కళాఖండాలు, వివిధ చేతివృత్తుల ఉత్పత్తులను ప్రదర్శిస్తున్నారన్నారు. పిఎం విశ్వకర్మ లబ్ధిదారులకు ఉచితంగా స్టాల్స్ కేటాయించి, మార్కెటింగ్ అవకాశాలు కల్పించడం జరిగిందని తెలిపారు. బిజినెస్-టు-బిజినెస్, బిజినెస్-టు- కస్టమర్ సంబంధాలను మెరుగు పరచడం, విశ్వకర్మ బ్రాండ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ ప్రదర్శన కమ్ అమ్మకాలు యొక్క ముఖ్య ఉద్దేశ్యం అన్నారు. రాష్ట్రంలో పిఎం విశ్వకర్మ పథకం అమలు తీరు, లబ్ధిదారులకు అందుతున్న రుణాలు, శిక్షణ, టూల్‌కిట్ ప్రోత్సాహకాలపై సెంథిల్ కుమార్ వివరించారు. చేతివృత్తుల అభివృద్ధి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేస్తుందని తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, రాజమండ్రి జనరల్ మేనేజర్ శ్రీవనిధర్ రామన్ మాట్లాడుతూ లబ్ధిదారు లకు అవసరమైన మార్గదర్శకాలు, రుణ సౌకర్యాలపై పూర్తి సహకారం అందిస్తామని చెప్పారు. జిల్లా పరిశ్రమల కేంద్రం, కాకినాడ జనరల్ మేనేజర్ సిహెచ్. గణపతి 'ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త' పథకం లక్ష్యాలను వివరించారు. లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ డి.వి. ప్రసాద్ మాట్లాడుతూ రుణాల విషయంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు బ్యాంకులను సంప్రదించాలని, అవసరమైన సహాయం అందిస్తామని తెలిపారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి మురళి శిక్షణ, స్టైపెండ్ అంశాలపై అవగాహన కల్పించారు. డిఐసిసిఐ ప్రతినిధి అరుగుల జార్జ్ బాబు లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవాలని కోరగా, గోల్డ్ స్మిత్ అసోసియేషన్ కార్యదర్శి సతీష్ స్వర్ణకారులు రుణాలను సద్వినియోగం చేసుకుని సకాలంలో చెల్లించాలని సూచించారు. ప్రజలు కుటుంబ సభ్యులు, మిత్రులతో కలిసి ట్రేడ్ ఫెయిర్‌ను సందర్శించి విశ్వకర్మ కళాకారులను ప్రోత్సహించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. రుణాలు, శిక్షణ, స్టైపెండ్‌లకు సంబంధించి సమస్యలు ఉన్న లబ్ధిదారులు ఈ వేదికను వినియోగించుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు, చేతివృత్తుల కళాకారులు పాల్గొన్నారు.

## తల్లిదండ్రుల వెలకట్టలేని త్యాగాలే

# మానవ మనుగడకు మూలం

**విజ్ఞాన్‌లో తల్లిదండ్రులకు చిన్నారుల సామూహిక పాదపూజ**
**ఘనంగా తల్లిదండ్రులకు పాదాభివందనం కార్యక్రమం**
**ముఖ్య అతిథిగా హాజరైన విద్యా సంస్థల చైర్మన్ అమ్మిరెడ్డి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** తమ పిల్లలకు ఉజ్వల భవిష్యత్తును అందించాలని నిత్యం ప్రయాసపడే తల్లిదండ్రులు పూజార్హులని, తల్లిదండ్రుల త్యాగాలు విలువ కట్టలేనివని, వారే ప్రత్యక్ష దైవాలని ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మల్లిడి అమ్మిరెడ్డి పేర్కొన్నారు. తూర్పు గోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో గల విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విజ్ఞాన్ విద్యార్థుల తల్లిదండ్రులకు పాదాభివందనం కార్యక్రమంలో అమ్మిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు ఈ కార్యక్రమంలో తొలుత పాఠశాల యాజమాన్య కమిటీ చిన్నారులతో తల్లిదండ్రులకు పాదపూజ చేయించి వారికి లోబడాలని చిన్నారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆదికవి నన్నయ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. మల్లిడి అమ్మిరెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రుల త్యాగాల వలనే మానవజాతి మనుగడ కొనసాగుతోందన్నారు. తొమ్మిది నెలలు ఎందుకు మోయాలి అని తల్లి అనుకుంటే మానవజాతి మనుగడే ఉండేది కాదు అని భావోద్వేగం చెందారు. తల్లిదండ్రులను గౌరవించుకోవడం ప్రతి చిన్నారుల కర్తవ్యమని వివరించారు. అనంతరం విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్ పర్సన్ డా. మల్లిడి శేషవేణి మాట్లాడుతూ తల్లిదండ్రులు అపారమైన ప్రేమతో, ఆప్యాయతతో పిల్లలను పెంచుతున్నారని, సమాజంలో మంచి పౌరులుగా ఎదిగి తమ భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకుంటూ తల్లిదండ్రులకు గర్వకారణంగా నిలవాల్సిన బాధ్యత ప్రతి కొడుకు,కూతురుపై ఉందని సూచించారు. విద్యతోపాటు విలువలను నేర్పించడమే తమ విద్యాసంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రిన్సిపాల్ ఎన్. త్రివేణి, విజ్ఞాన్ జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ అచ్చిరెడ్డి, వైఎస్ఆర్ రూరల్ డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపాల్ ఎస్.ఎం. సతీష్ రెడ్డి, ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కేంద్రం నిధులతో కరీంనగర్‌ను

# అభివృద్ధి చేస్తాం : బండి సంజయ్



**కరీంనగర్, విశ్వం వాయిస్ న్యూస్ :** అత్యధిక స్థానాల్లో గెలిపించి.. కరీంనగర్ ప్రజలు భాజపాపై గురుతర బాధ్యత పెట్టారని కేంద్రమంత్రి బండి సంజయ్ అన్నారు. కరీంనగర్ కార్పొరేషన్ ఎన్నికల్లో భాజపా అభ్యర్థులు అత్యధిక స్థానాలు కైవసం చేసుకున్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. భాజపా విజయం కోసం కష్టపడి పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కరీంనగర్ ప్రజలు తమపై ఉంచిన బాధ్యతను స్వీకరిస్తున్నట్టు చెప్పారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సహకారంతో కేంద్రం నుంచి నిధులు తెచ్చి కరీంనగర్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. "కరీంనగర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎం లోపాయికారీ ఒప్పందం చేసుకున్నాయి. ఓటుకు రూ.7వేల నుంచి రూ.10వేల వరకు పంపిణీ చేశారు. కాంగ్రెస్, ఎంఐఎం మతం పేరుతో అల్లర్లు సృష్టించాలని చూశాయి. భాజపా అభ్యర్థులను ప్రలోభాలకు గురి చేసేందుకు రూ.50లక్షల నుంచి రూ.కోటి వరకు ఇచ్చేందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమైంది. జీహెచ్ఎంసీని ఒవైసీ కుటుంబం, రేవంత్‌రెడ్డి అన్నదమ్ముల ఆస్తుల మాదిరిగా పంచుకున్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోని మూడు కార్పొరేషన్లను కూడా భాజపా కైవసం చేసుకుంటుంది" అని బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.

విశ్వం వాయిస్
అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
తూర్పు గోదావరి
జిల్లా ఎడిషన్
శనివారం, 14 ఫిబ్రవరి 2026
www.viswamvoice.com



# అంబటి అరెస్టు కక్ష సాధింపే చర్యే

**రాష్ట్రంలో రాక్షసపాలన, రెడ్ బుక్ రాజ్యమేలుతోంది - అంబటి, జోగి ఇళ్ళపై దాడి అమానుషం**
**సెంట్రల్ జైలు ములాఖాత్ లో తమ్మినేని సీతారాం, జడ శ్రవణ్ కుమార్, మార్గాని భరత్ రామ్**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మాజీ మంత్రి అంబటి రాంబాబును కక్షపూరితంగా అరెస్టు చేశారని శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారామ్,మాజీ ఎంపీ మార్గాని భరత్, రిటైర్డ్ జడ్జి జడ శ్రావణ్ మండిపడ్డారు. రాష్ట్రంలో రెడ్ బుక్ రాజ్యాంగం,రాక్షస పాలన నడుస్తోందని వారు ధ్వజమెత్తారు.ఇంతకంటే అనైతికంగా మాట్లాడినా వాళ్ళ మీద చర్యలు లేవని విమర్శించారు. రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న మాజీ మంత్రి అంబటి రాంబాబుని శాసనసభ మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం మాజీ జడ్జ్ జడ శ్రవణ్, మాజీ ఎంపీ,వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ ములాఖత్ లో కలిశారు.అనంతరం జైలు బయట వారు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలుపరుస్తున్న లోకేష్ మన రాజ్యాంగాన్ని అలాగే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని అవమానించడమేనని విమర్శించారు. ఇళ్ల పైన రౌడీ మూకలతో దాడి చేసిన వాళ్లపై కేసులు కట్టకుండా బెయిల్ పైన బయటకు పంపడం, అలాగే పొరపాటున నోటిమాట జారినందుకు అంబటి రాంబాబు, జోగి రమేష్ ఇళ్ల పైన రాక్షసంగా దాడి చేయడం, మాట జారినందుకు క్షమాపణ చెప్పినా కూడా లేని కేసులు అంటగట్టి ఇవాళ సెంట్రల్ జైల్లో కాపు సింహం అంబటి రాంబాబుని పెట్టడం అమానుషమన్నారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు పైన సుమారు 47 కేసులు పెట్టడం చాలా అమానుషమని, దీనిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తున్నదని చెప్పారు. పెట్రోల్ బాంబులతో దాడి చేశారని, అప్పుడు ఇంట్లో స్త్రీలు మాత్రమే నివసిస్తున్నారని, వాళ్ళకి ఏమన్నా జరగరానికది జరిగితే దానికి బాధ్యత ఎవరు వహిస్తారని తమ్మినేని ప్రశ్నించారు. అక్కడ స్థానిక ఎమ్మెల్యే చెప్పకనే చెప్పారు ఈ దాడి చేయించింది తామే అని అయినా లా అండ్ ఆర్డర్ న్యాయవ్యవస్థ అన్నిటికి మసిపూసి మారేడు కాయ చేసి ఈ రకంగా ప్రవర్తించడం కూటమి ప్రభుత్వం చేస్తున్న నిర్వాకమని,.ఇవాళ అధికారం ఉంది కనుక మీరు ఇష్టం వచ్చినట్టు చెలాయిస్తున్నారు రేపు మీరు ముగ్గురు మూడు విమానాలు పట్టుకుని పారిపోయే పరిస్థితి వస్తుందని హెచ్చరించారు. తిరుపతి లడ్డు విషయంలో తీర్పు మీకు అనుకూలంగా రాకపోయేసరికి ఇలాంటి అకృత్య కార్యాలకు తెరలేపిన కూటమి ప్రభుత్వం. మీరు చేస్తున్న ప్రజాస్వామిక కార్యక్రమాలను ప్రజలు గమనిస్తున్నారని, తప్పక దీనికి మూల్యం చెల్లించాల్సి వస్తుందని ఈ సందర్భంగా భరత్, తమ్మినేని అన్నారు.

# మహాశివరాత్రికి ఏర్పాట్లు కట్టుదిట్టం : కమిషనర్ రాహుల్ మీనా



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాశివరాత్రి సందర్భంగా పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల సౌకర్యార్థం ఘాట్ల వద్ద కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు కమిషనర్ రాహుల్ మీనా తెలిపారు. శుక్రవారం కోటిలింగాల ఘాట్, చింతాలమ్మ ఘాట్, పుష్కర్ ఘాట్, మార్కండేయ ఘాట్, సరస్వతి ఘాట్, గౌతమి ఘాట్‌ల వద్ద ఏర్పాట్లను అధికారులతో కలిసి పర్యవేక్షించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, పార్కింగ్, భద్రతాపరమైన అంశాల్లో ఎక్కడా రాజీపడకూడదని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఘాట్లలోనికి ప్రవేశించు మార్గాలు, వెలుపలకు వెళ్లు మార్గాలు, ఘాట్ల వద్ద వాటర్ లెవల్, జల్లు స్నాన ఏర్పాట్లు, దుస్తులు మార్చుకొను గదులు, ఫీడింగ్ రూమ్, టాయిలెట్లను పరిశీలించారు. విద్యుత్ సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా చూడాలన్నారు. బారికేడింగ్, వాహనాల పార్కింగ్, ఎమర్జెన్సీ వాహనాల రాకపోకలపై టౌన్ ప్లానింగ్, పోలీస్ శాఖ అధికారులకు పలు సూచనలు చేశారు. ఘాట్ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉండాలని.. మెడికల్ క్యాంపులో సరిపడా సిబ్బంది, మందులు అందుబాటులో ఉండాలని మెడికల్ హెల్త్ ఆఫీసర్‌కు సూచించారు. అనంతరం ఘాట్లలో విధులు నిర్వహించు సిబ్బందితో మాట్లాడారు. భక్తుల రద్దీని సురక్షితంగా, క్రమబద్ధంగా నియంత్రించాలని పేర్కొన్నారు. అలాగే భక్తులకు కల్పించిన సౌకర్యాలపైన ఆయా ఘాట్లలో డ్యూటీ చేయు ఉద్యోగులకు పూర్తి అవగాహన ఉండాలన్నారు. రిలీవర్ వచ్చు వరకు తప్పనిసరిగా విధులలోనే ఉండాలని.. అత్యవసర సమయంలో ఘాట్ ఇంఛార్జికి రిపోర్టు చేయాలన్నారు. అనంతరం చిన్నారులకు డిజిటల్ ట్యాగ్ లపైన వాలంటీర్లతో మాట్లాడారు. పిల్లలతో వచ్చు కుటుంబ సభ్యులకు ఈ డిజిటల్ ట్యాగ్ పైన అవగాహన కల్పించడతో పాటు.. వారికి పూర్తిస్థాయి సహకారం అందించాలని సూచించారు. మహాశివరాత్రి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా దిశానిర్దేశం చేశారు. ఆయన వెంట అదనపు కమిషనర్ పి.వి.రామలింగేశ్వర్, డిప్యూటీ కమిషనర్ ఎస్.వెంకటరమణ, సెక్రటరీ జి.శైలజావల్లి, సిటీ ప్లానర్ జి.వి.ఎస్.ఎన్.మూర్తి, ఎస్ఈ రీటా, ఎంహెచ్ఓ వినూత్న, సీఐ(ట్రాఫిక్) నబీ, ఈఈ మదర్సా అలీ, మాధవి, ఇతర అధికారులు, సిబ్బంది ఉన్నారు.

# షర్మిలరెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతం చెయ్యాలి

**ప్రధానిగా రాహుల్‌ని, సీఎంగా షర్మిల రెడ్డిని చేయడమే కాంగ్రెస్ శ్రేణుల లక్ష్యం..**
**కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంట్ కో-ఆర్డినేటర్ టీ.కే విశ్వేశ్వర రెడ్డి, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళిధర్ పిలుపు**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని,రాష్ట్ర ముఖ్యమంత్రిగా వై.ఎస్ షర్మిల రెడ్డిని చేయడమే కాంగ్రెస్ పార్టీ శ్రేణుల లక్ష్యమని కాంగ్రెస్ పార్టీరాజమండ్రి పార్లమెంట్ కో - ఆర్డినేటర్ టీ.కే విశ్వేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి నగర అధ్యక్షులు బాలేపల్లి మురళీధర్ పేర్కొన్నారు. శుక్రవారం రాజమహేంద్రవరం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బాలేపల్లి మురళిధర్ అధ్యక్షతన రాజమండ్రి పేపర్ మిల్ ఎదురుగా ఉన్న శ్రీకృష్ణ సాయి కళ్యాణ మండపంలో కాంగ్రెస్ పార్టీ తూర్పుగోదావరి జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకుల విస్తృతస్థాయి సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా టీకే విశ్వేశ్వర రెడ్డి మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరు మార్చి జీ రాంజీ పేరు పెట్టడం పై ఆగ్రహం వ్యక్తం చేశారు బిజెపి చేస్తున్న కుటిల రాజకీయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ఎండగట్టాలని కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. పీసీసీ అధ్యక్షురాలు చేపట్టిన యాత్ర వ్యవసాయ కూలీలకు సంబంధించింది కనుక గ్రామీణ ప్రాంతాలైన దుద్దుకూరు గ్రామంలో 2 వేల మంది వ్యవసాయ కూలీలతో సభ ఏర్పాటు చేస్తామని, అలాగే కడియపులంకలో 2 వేల మందితో బహిరంగ సభ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు . మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం గతంలో 90 శాతం నిధులు కేంద్రం భరిస్తే, 10 శాతం నిధులు రాష్ట్రాలు భరించేవని, అయితే ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వాలు 40 శాతం, కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులు భరించాల్సి రావడం వలన రాష్ట్రాలకు పెను భారంగా మారుతుందని పేర్కొన్నారు. 40 శాతం నిధులు రాష్ట్రం భరించాల్సి వస్తే రాష్ట్ర ప్రభుత్వం 5 వేల కోట్లు ఖర్చు చేయాల్సి ఉంటుందని, ఇది రాష్ట్రానికి పెను భారంగా మారుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. మహాత్మా గాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు చేయడం వలన రాష్ట్రాలకు కలిగే నష్టాలను వివరిస్తూ మార్చి నెలలో తూర్పుగోదావరి జిల్లాలో పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి చేపట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర ఉంటుందని అన్నారు. ఈ యాత్రను విజయవంతం చేసేందుకు, జన సమీకరణ చేసి విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా తూర్పుగోదావరి జిల్లాకు ప్రత్యేక గుర్తింపు ఉందని ఈ నేపథ్యంలో తూర్పుగోదావరి జిల్లాలో పిసిసి అధ్యక్షురాలు పర్యటన ప్రతిష్టాత్మకంగా తీసుకొని కార్యకర్తలు అందరూ జన సమీకరణ చేసి ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర విజయవంతం చేసేందుకు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు.గతంలో పీసీసీ అధ్యక్షురాలు రాజమండ్రి పర్యటన సందర్భంగా భారీ స్థాయిలో ఊరేగింపు చేసినట్లు తెలిపారు. ప్రస్తుత పర్యటన కూడా అదేవిధంగా విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి నగర అధ్యక్షులు బాలేపల్లి మురళిధర్ మాట్లాడుతూ దేశ ప్రధానిగా రాహుల్ గాంధీని రాష్ట్ర ముఖ్యమంత్రిగా షర్మిలారెడ్డిని గెలిపించడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. పిసిసి అధ్యక్షులు షర్మిల రెడ్డి యాత్ర విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మోతా శారద, డాక్టర్ వడియార్, డాక్టర్ రాజశేఖర్, ఎండి షరీఫ్, కాటం రవి, వివిధ నియోజవర్గాల కోఆర్డినేటర్లు, మండల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**పలు గ్రామాల్లో**

# సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ చేసిన బత్తుల



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజానగరం నియోజకవర్గనికి ఫిబ్రవరిలో 226 మంది బాధితులకు 1.16 కోట్ల రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేసినట్లు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి తెలిపారు. శుక్రవారం కోరుకొండ మండలంలోని గాడాల,మధురపూడి, కోరుకొండ, బూరుగుపూడి, కాపవరం, పశ్చిమ గోనగూడెం తదితర గ్రామాల్లో వైద్యం చేయించుకున్న బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి, ధైర్యంగా ఉండాలన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు అందజేశారు.ఈ సందర్భంగా బత్తుల మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాజానగరశీ నియోజకవర్గం అభివృద్ధికి శాసనసభ్యులు బలరామకృష్ణకు అన్ని విధాల సహకరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. గత నెల జనవరిలో 109 మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కులు అందించమన్నారు. వైద్యం చేయించుకోలేని ఎందరో నిరుపేదలకు ముఖ్యమంత్రి సహాయ నిధి వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. కులమతాలకు పార్టీలకు అతీతంగా గత ఏ ప్రభుత్వం లోనూ లేని విధంగా ఎన్డీఏ హయాంలో అనారోగ్యంగా ఉన్నవారికి ముఖ్యమంత్రి సహాయ నిధి అందుతుందన్నారు. బాధితులకు ఇబ్బంది కలగకుండా, మండలాల వారీగా ఇళ్ల వద్దకే వెళ్లి అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు అడ్డాల శ్రీను, ముక్కా రాంబాబు, డాక్టర్ అడపా శ్రీనివాస్, యర్రంశెట్టి పోలారావు, జాజుల రాము, తన్నీరు తాతాజీ, బదిరెడ్డి దొర, జాజుల గణేష్, తేలగంశెట్టి శివ, తాటికొండ బుజ్జి, సుంకర శ్రీను, దుర్గాప్రసాద్, బొమ్మల గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

**షర్మిల ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర**

# విజయవంతం చేయాలి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మహాత్మా గాంధీ పేరును ఉపాధి హామీ పథకానికి తొలగించడం పిరికి చర్య అని పిసిసి కార్యనిర్వాహక అధ్యక్షులు, మాజీ కేంద్రమంత్రి జే.డి శీలం అన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బోడా వెంకట్ అధ్యక్షతన జిల్లా సమీక్ష సమావేశం జరిగిందిఈ సందర్భంగా జేడి శీలం మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా షర్మిల తలపెట్టిన ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర త్వరలో తూర్పుగోదావరి జిల్లాలో జరగనుందని ఆ యాత్రను జయప్రదం చేయాలని శీలం కోరారు, జిల్లాలో ఉదయం రచ్చబండ మధ్యాహ్నమ్ భాహిరంగసభ నిర్వహించనునట్టు తెలిపారు మాజీ శాసనసభ్యులు ఉన్నమట్ల ఎలిజా మాట్లాడుతూ షర్మిల యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని దేశరాష్ట్ర భవిష్యత్ కాంగ్రెస్ తోనే సాధ్యమని రాహుల్ గాంధీ ని ప్రధాని చేసే దిశగా కార్యకర్తలు కృషిచేయాలాన్నారు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు బోడా వెంకట్ మాట్లాడుతూ షర్మిలమ్మ నాయకత్వంలో తూర్పుగోదావరి జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో పిసిసి ప్రధాన కార్యదర్శి అరిగేల అరుణ కుమారి,మాజీ ప్రధాన కార్యదర్శి జ్యేష్ఠ సతీష్ బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) పట్నాల శ్రీనివాస్, ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర అర్బన్ కోఆర్డినేటర్, ముంద్రు పెదబాబు, విల్లూరి రమేష్,కాటం రవి,అయిల శేషగిరి, చామర్తి లీలావతి, చింతాడ వెంకటేశ్వరరావు, పిట్టా రామారావు, కౌలురి రతన్ రాజు, జొన్నకూటి రవి, తారాకేష్, బోనిగే రాంబాబు, ప్రభాకర్ చౌదరి కాటం రామకృష్ణ, ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ సేవలు అభినందనీయం

**- జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు "ఎడమ చేతితో దానం చేస్తే కుడి చేతికి తెలియకూడదు" అనే నానుడికి అద్దం పడుతున్నాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత పేర్కొన్నారు. జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ (డిఎల్ఎస్ఏ) ఆధ్వర్యంలో వసతి గృహాల విద్యార్థులకు స్థానిక ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాలు గురువారం సాయంత్రం పరుపులు అందజేసే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ, పేద మరియు నిరుపేద వర్గాలకు సమన్యాయం చేయడంలో న్యాయ సేవాధికారి సంస్థ నిబద్ధతతో పనిచేస్తోందని తెలిపారు. జాతీయ మరియు రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థలు సరైన దిశానిర్దేశం చేస్తున్నాయని వెల్లడించారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని కోనసీమ, కాకినాడ, అల్లూరి సీతారామరాజు, తూర్పు గోదావరి జిల్లాల పరిధిలో ఉన్న సుమారు 500 సంక్షేమ వసతి గృహాలను 65 మంది న్యాయ అధికారులతో కలిసి సందర్శించి, విద్యార్థులకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనపై నివేదిక సమర్పించామని తెలిపారు. ఆ నివేదికల ఆధారంగా అనేక చోట్ల వసతులు మెరుగు పర్చినట్లు పేర్కొన్నారు. ఆర్థిక నిధుల విడుదలలో జాప్యం వల్ల కొంత ఇబ్బందులు ఎదురవు తున్నప్పటికీ, వాటిని పరిష్కరించేందుకు న్యాయ సేవాధికారి సంస్థ చర్యలు తీసుకుంటోందన్నారు. వసతి గృహాల్లో సమస్యలు ఉంటే విద్యార్థులు వార్డెన్ లేదా సంబంధిత అధికారులకు తెలియ జేయాలని, స్పందన లేనిపక్షంలో న్యాయ సేవాధికారి సంస్థకు ఫిర్యాదు చేయవచ్చని, ఫిర్యాదుదారుల పేర్లు గోప్యంగా ఉంచబడతాయని స్పష్టం చేశారు. గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం ఆర్ట్స్ కళాశాల సమీపంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 370 మంది విద్యార్థులకు పరుపులు అందజేసే కార్యక్రమం నిర్వహించారు. దాతృత్వం చూపించిన ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ కి ప్రశంసా పత్రాలు అందజేస్తూ, సేకరించిన నిధుల్లో 90 శాతం ఇటువంటి సేవా కార్యక్రమాలకు వినియోగించడం అభినందనీయమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. మానవ జీవితం చిన్నదైనా, సమాజానికి మేలు చేసే కార్యక్రమాలు చేపట్టడం ద్వారా పలువురికి స్ఫూర్తిగా నిలవాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డి.ఎల్.ఎస్.ఎ కార్యదర్శి ఎన్. శ్రీలక్ష్మి, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి ఎం.డి. ఘయాజుద్దిన్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ ట్రస్ట్ ప్రతినిధులు బాల నాగు గణేష్ గుప్తా, ఐ.మురళీధర్, బి.సుబ్బారాయుడు, వై.వెంకటేశ్వరరావు, ఎల్. వీరభద్రరావు, ఎస్. సీతారామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ శ్రీ మిత్ర క్లబ్ సేవలు ప్రారంభిస్తాం..

**లయన్స్ క్లబ్ శ్రీ మిత్ర ప్రమాణ స్వీకారమహోత్సవం ఘనంగా - కోశాధికారిగా వెలుగురి రవికుమార్**
**రాజమండ్రిలో లైన్స్ క్లబ్ శ్రీ మిత్ర ప్రమాణ స్వీకారమహోత్సవం**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** లయన్స్ క్లబ్ ఖాతాలో మరొక కొత్త క్లబ్ పురుడు పోసుకుంది. వివరాల్లోకి వెళితే నిన్న రాజమండ్రిలో స్థానిక గుండు వారి వీధిలోని లైన్స్ క్లబ్ హాల్లో లయన్స్ శ్రీ మిత్ర క్లబ్ ఇన్స్టాలేషన్ ఘనంగా జరిగింది. క్లబ్ అధ్యక్షులుగా రౌతుల స్వామి, ప్రధాన కార్యదర్శిగా కొత్తపల్లి ఆడం, కోశాధికారిగా వెలుగురి రవికుమార్ ప్రమాణ స్వీకారం చేశారు. కాకినాడకు చెందిన లైన్స్ సంకల్ప ఈ సరికొత్త క్లబ్ ను స్పాన్సర్ చేసింది. ఇది కొత్త క్లబ్ కావడంతో చార్టర్ క్లబ్ గా మరింత విభిన్నత చేకూర్చుకుంది. డిస్ట్రిక్ట్ గవర్నర్ వజ్రపు కోటేశ్వరరావు ఈ సభకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇండక్షన్ ఆఫీసర్ గా రాజమండ్రి కి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త గ్రంధి వెంకటేశ్వరరావు వ్యవహరించారు. మరో విశిష్ట అతిథిగా సీనియర్ మెంబర్ బివియన్ రెడ్డి హాజరయ్యారు. క్యాబినెట్ సెక్రటరీ హోదాలో లక్ష్మణ రెడ్డి, క్యాబినెట్ ట్రెజరర్ హోదాలో మణి బాబు, హాజరయ్యారు. మరొక కోఆర్డినేటర్ గా లయన్ శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. రీజనల్ చైర్ పర్సన్ కొయ్యన కుమారి కూడా ఈ సభకు అతిథిగా హాజరయ్యారు. అంతేకాకుండా ఈ కార్యక్రమానికి కాకినాడకు చెందిన పలువురు లైన్ సభ్యులు రాజమండ్రి కి చెందిన ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షులు రౌతుల స్వామి మాట్లాడుతూ నేటి నుండి లైన్స్ శ్రీ మిత్ర క్లబ్ తన సేవలు ప్రారంభిస్తుందని తెలియజేశారు.

# హైకోర్టులో ఓటు హక్కు వేసిన మేడా శ్రీనివాస్



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** శుక్రవారం ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టులో ఓటు హక్కును"ఆలా" ప్రధాన కార్యదర్శి మేడా శ్రీనివాస్ వినియోగించుకున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అత్యంత ప్రతిష్టాత్మకమైన బార్ కౌన్సిల్ ఎన్నికల్లో పోటీ చేయుచున్న ప్రముఖ న్యాయవాది డా. ఎమ్.వి.రాజారామ్ ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తున్నారని మేడా శ్రీనివాస్ ఓ ప్రకటనలో ఆశాభావం వ్యక్తం చేశారు.

# "ప్రజావారధి"లో ప్రజా సమస్యలపై విజ్ఞాపనలు స్వీకరణ

**- బీజేపీ కార్యాలయంలో 'మీ సమస్య... మా బాధ్యత'**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** 'మీ సమస్య... మా బాధ్యత' అనే నినాదంతో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ ప్రజా సమస్యల పరిష్కారం దిశగా భారతీయ జనతా పార్టీ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'జనతా వారధి' కార్యక్ర మాన్ని స్థానిక క్వారీ ఏరియాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కురగంటి సతీష్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రజల నుండి వినుతులను స్వీకరించారు. గ్రామాల్లో మంచినీటి సమస్యలు, విద్యార్థుల పిల్లలు ఫీజ్ రీ ఇంబర్స్ మెంట్, వికలాంగులు పింఛన్ల తదితర సమస్యలపై పలు వినపత్రాలు వచ్చాయి. అలాగే అన్నదాత సుఖీభవ సక్రమంగా అందటం లేదని రైతులు ఫిర్యాదు చేశారు. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందని సతీష్ తెలిపారు. ప్రజాసేవే పరమావధిగా,ప్రతి సమస్యకు పరిష్కారం చూపే దిశగా నిరంతరం భారతీయ జనతా పార్టీ కృషి చేస్తుందని తెలిపారు. ఈరోజు వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చేస్తామన్నారు. జనతా వారధి జిల్లా కన్వీనర్ శివరామరాజు, కో కన్వీనర్ బండి సత్య ప్రసాద్,రాష్ట్ర నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ యానాపు ఏసు, పార్టీ జోనల్ కో ఇన్చార్జ్ పడాల హత్తి రామ్, పార్టీ జిల్లా కార్యదర్శి స్వామి సూరి కిరణ్,మీనాక్షి,జిల్లా నాయకులు దాసరి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్‌పీఐ (అంబేద్కర్) రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్‌గా డివివిఎస్ మూర్తి నాయామకం



**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (అంబేద్కర్) రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పిట్టా వర ప్రసాద్ పార్టీ రాష్ట్ర లీగల్ సెల్ అడ్వైజర్‌గా దండు బోయిన వీర వెంకట సత్యనారాయణ మూర్తిని నియమిస్తూ అధికారిక నియామక ఉత్తర్వులను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ, పార్టీ సిద్ధాంతాలకు న్యాయపరమైన బలం చేకూర్చడం, దళితులు, గిరిజనులు, బీసీలు మరియు అణగారిన వర్గాల హక్కుల పరిరక్షణలో చట్టపరమైన పోరాటాలను సమర్థవంతంగా నడిపించేందుకు లీగల్ సెల్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై చట్టపరమైన చర్యలు తీసుకునే దిశగా రాష్ట్ర లీగల్ సెల్ మరింత చురుకుగా పనిచేయాలని సూచించారు. దండు బోయిన వీర వెంకట సత్యనారాయణ మూర్తి గారు న్యాయ రంగంలో అనుభవం కలిగినవారని, వారి సేవలు పార్టీకి మరియు సామాజిక న్యాయ ఉద్యమానికి బలాన్నిస్తాయని రాష్ట్ర అధ్యక్షులు ఆశాభావం వ్యక్తం చేశారు. నియామక ఉత్తర్వులు అందుకున్న అనంతరం మూర్తి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం సాధనలో కట్టుబడి పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ ముఖ్య నాయకులు కదలి సత్యమూర్తి,యానం పార్టీ అధ్యక్షులు కుడిపూడి సుబ్రమణ్యం, రావులపాలెం మండల అధ్యక్షులు కాలా భక్తులు సురేష్ పాల్గొన్నారు.

మేడం సార్
# మేడం అంతే..!
## కుర్రాళ్లను కవ్విస్తున్న పూజిత పొన్నాడ

2016లో కింగ్ నాగార్జున నటించిన ఊపిరి సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టింది పూజిత పొన్నాడ. ఆ తర్వాత అక్కినేని హీరో నాగ చైతన్య ప్రేమమ్ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ గా కనిపించింది. ఈ రెండు సినిమాల్లో తన క్యూట్ నెస్ తో ఆకట్టుకుంది పూజిత. 2016లో కింగ్ నాగార్జున నటించిన ఊపిరి సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టింది పూజిత పొన్నాడ. ఆ తర్వాత అక్కినేని హీరో నాగ చైతన్య ప్రేమమ్ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ గా కనిపించింది. ఈ రెండు సినిమాల్లో తన క్యూట్ నెస్ తో ఆకట్టుకుంది పూజిత. కాగా పూజితకు మంచి గుర్తింపు తీసుకొచ్చిన సినిమా ఏదంటే రామ్ చరణ్ రంగస్థలం అనే చెప్పాలి. ఇందులో హీరో ఆది పినిశెట్టి ప్రియురాలు పద్మ పాత్రలో ఆమె అభినయం అందరినీ ఆకట్టుకుంది. సినిమాలో కనిపించింది కొంత సేపే అయినా తన నటనతో ఆకట్టుకుంది పూజిత. రంగస్థలం సినిమా తర్వాత వరుస అవకాశాలు అందుకుంది ఈ అమ్మడు. ఆ తర్వాత రాజుగాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, కల్కి, వేర్ ఈజ్ వెంకట లక్ష్మి, రన్, మిస్ ఇండియా, కథ కంచికి మనం ఇంటికి, ఓదెల రైల్వే స్టేషన్ తదితర సినిమాల్లో నటించింది పూజిత. అలాగే రవితేజ రావణాసుర సినిమాల్లో మరో కీలక పాత్ర పోషించింది. అయితే ఎందుకోకానీ ఈ ముద్దుగుమ్మ క్రేజ్ మాత్రం రావడం లేదు. వరుసగా సినిమాలు చేస్తునా.. అందం అభినయం రెండూ ఉన్న కూడా ఈ అమ్మడికి అంతగా గుర్తింపు రావడంలేదు. ఇటీవల పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమాలో పూజిత కూడా కనిపించింది. ఓ స్పెషల్ సాంగ్ లో మెరిసింది ఈ భామ. అలాగే ఓ తమిళ సినిమాలోనూ నటిస్తోందీ అందాల తార. తాజాగా సోషల్ మీడియాలో అదిరిపోయే ఫోటోలను పంచుకుంది.



విజయ్-రష్మిక వెడ్డింగ్‌లో
# ఊహించని ట్విస్ట్..
## భారీ ఆఫర్‌ను తిరస్కరించిన రౌడీ బాయ్!



టాలీవుడ్ లవ్ బర్డ్స్ విజయ్ దేవరకొండ- రష్మిక మందన్నా గతేడాది ఆఖరులో సీక్రెట్ గా ఎంగేజ్మెంట్ చేసుకున్నారు.. కానీ ఇప్పటివరకు ఈ విషయంపై ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదీ ప్రేమ పక్షులు. ఈ క్రమంలో పెళ్లి విషయంలోనూ అంతే గోప్యత పాటించాలని ఈ లవ్ బర్డ్స్ నిర్ణయించుకున్నట్లు సమాచారం. టాలీవుడ్ మోస్ట్ హ్యాపెనింగ్ కపుల్ విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల పెళ్లి వార్త ఇప్పుడు నేషనల్ వైడ్ హాట్ టాపిక్‌గా మారింది. ఆన్‌స్క్రీన్‌పై తమ కెమిస్ట్రీతో మ్యాజిక్ చేసిన ఈ జంట.. త్వరలోనే రియల్ లైఫ్‌లో ఒక్కటి కాబోతున్నారు. ఫిబ్రవరి 26న రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్ వేదికగా వీళ్ళ వివాహం అత్యంత వైభవంగా జరగనుందని తెలుస్తుంది. ఓ వైపు తమ తమ సినిమాల షూటింగ్స్‌తో బిజీగా ఉంటూనే.. మరోవైపు పెళ్లి పనులను కూడా చకచకా చక్కబెడుతున్నారు. కేవలం కుటుంబ సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో జరగబోయే ఈ డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం ఉదయ్‌పూర్‌లోని ఓ విలాసవంతమైన ప్యాలెస్‌లో భారీ ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ రోజుల్లో సెలబ్రిటీల పెళ్లిళ్లు కేవలం కుటుంబ వేడుకలు మాత్రమే కాదు, కోట్లు కురిపించే బిజినెస్ వ్యవహారాలుగా కూడా మారిపోయాయి. ముఖ్యంగా డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ హవా పెరిగాక.. స్టార్స్ పెళ్లి వీడియోల స్ట్రీమింగ్ హక్కుల కోసం ఓటీటీ సంస్థలు పోటీ పడుతున్నాయి. గతంలో లేడీ సూపర్ స్టార్ నయనతార, విఘ్నేష్ శివన్‌ల పెళ్లి వీడియో హక్కులను నెట్‌ఫ్లిక్స్ దాదాపు 25 కోట్ల రూపాయలకు కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. బాలీవుడ్‌లో కూడా సిద్దార్థ్ మల్హోత్రా-కియారా అద్వానీ, విక్కీ కౌశల్-కత్రినా కైఫ్ వంటి జంటల పెళ్లిళ్లకు భారీ డిమాండ్ ఏర్పడింది. ఈ ట్రెండ్ ఇప్పుడు టాలీవుడ్‌లోనూ ఊపందుకుంది. విజయ్ దేవరకొండ, రష్మికలకు ఉన్న పాన్ ఇండియా క్రేజ్ దృష్ట్యా.. వీళ్ళ పెళ్లి వీడియో హక్కుల కోసం ఓ ప్రముఖ ఓటీటీ సంస్థ కళ్లు చెదిరే ఆఫర్ ఇచ్చినట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. నయనతార పెళ్లికి ఇచ్చిన దానికంటే డబుల్, అంటే దాదాపు 50 కోట్ల రూపాయలకు పైగా ఆఫర్ చేసిందని.. ఈ వెడ్డింగ్ వీడియోను ఒక డాక్యుమెంటరీ తరహాలో షూట్ చేసి, స్ట్రీమింగ్ చేస్తే రికార్డు స్థాయి వ్యూస్ వస్తాయని సదరు సంస్థ భావించింది. ఇంత భారీ మొత్తం ఆఫర్ వస్తే ఎవరైనా సరే ఆలోచనలో పడతారు.. కానీ విజయ్ దేవరకొండ మాత్రం ఈ విషయంలో చాలా క్లారిటీగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇక్కడే మన రౌడీ బాయ్ తన ఆటిట్యూడ్ చూపించారు. తన వ్యక్తిగత జీవితాన్ని, ముఖ్యంగా పెళ్లి లాంటి పవిత్రమైన ఘట్టాన్ని వ్యాపారం చేసుకోవడం ఇష్టం లేక.. ఆ భారీ ఆఫర్‌ను చాలా సున్నితంగా తిరస్కరించారని తెలుస్తుంది. పెళ్లి అనేది పూర్తిగా తన ప్రైవేట్ స్పేస్ అని, ఆ తీపి జ్ఞాపకాలను కేవలం తమ కుటుంబం, సన్నిహితుల మధ్యే ఉంచుకోవాలని విజయ్ భావిస్తున్నట్లు సమాచారం. కెమెరాల హడావిడి, లైవ్ టెలికాస్ట్‌ల ఆర్భాటం లేకుండా.. సాంప్రదాయబద్ధంగా, ప్రశాంతంగా పెళ్లి చేసుకోవాలన్నదే విజయ్, రష్మికల ఉద్దేశంగా కనిపిస్తుంది. పైగా ఓటిటి సంస్థ ఎంటర్ అయితే ఆ తర్వాత పెళ్లిలో వాళ్లు చేసే అతి కూడా భరించాల్సిందే.

క్రీడా వాయిస్

# టీమిండియాకి మాత్రమే ఆ ఛాన్స్.. మాకివ్వలేదు.!



టీ20 ప్రపంచకప్ 2026లో భారత్‌తో కీలక మ్యాచ్ తర్వాత నమీబియా కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ ఐసీసీ షెడ్యూలింగ్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. తమ జట్టుకు రాత్రి ప్రాక్టీస్ సెషన్ కేటాయించకపోవడం, భారత్‌కు రెండు సెషన్లు ఇవ్వడంపై కీలక వ్యాఖ్యలు చేశాడు. నైట్ మ్యాచ్‌లకు సిద్ధపడటం కష్టమని, తమ విజయ అవకాశాలపై ప్రభావం చూపిందని ఆందోళన వ్యక్తం చేశాడు. టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఆతిథ్య భారత్‌తో ఫిబ్రవరి 12న ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో కీలక మ్యాచ్ చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ఆ మ్యాచ్‌లో నమీబియా జట్టు కెప్టెన్ గెర్హార్డ్ ఎరాస్మస్ ఐసీసీ షెడ్యూలింగ్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేశాడు. ప్రాక్టీస్ సెషన్ల కేటాయింపులో తమకు తీవ్ర వివక్ష జరిగిందని అతడు సంచలన వ్యాఖ్యలు చేశాడు. బుధవారం జరిగిన మ్యాచ్‌లో నమీబియాపై టీమిండియా ఘన విజయం సాధించింది. ఆ మ్యాచ్ అనంతరం నమీబియా కెప్టెన్ ఎరాస్మస్ కీలక వ్యాఖ్యలు చేశాడు. తమ జట్టుకు ఒక్క నైట్ ప్రాక్టీస్ సెషన్ కూడా కేటాయించలేదని, అదే సమయంలో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్‌కు మాత్రం రెండు రాత్రి సెషన్లు ఇచ్చారని పేర్కొన్నాడు. నైట్ మ్యాచ్‌కు ముందు ప్రాక్టీస్ సమయాల్లో ఇలా తేడాలు ఉండటం ఆశ్చర్యం కలిగిస్తోందని, అసలు ఇలా ఎందుకు జరుగుతుందో మీరే ఆలోచించుకోవాలని అతడు పరోక్షంగా నిర్వాహకులపై చురకలు అంటించాడు. నమీబియా లాంటి చిన్న దేశాలకు రాత్రి వేళల్లో ఆడటం అనేది ఒక పెద్ద సవాలని ఎరాస్మస్ వివరించాడు. తమ దేశంలో ఫ్లడ్ లైట్ సదుపాయం లేని స్టేడియాలు ఉండటమే దీనికి ప్రధాన కారణమని పేర్కొన్నాడు. మౌలిక సదుపాయాల కొరత వల్ల ఆటగాళ్లకు ఫ్లడ్ లైట్ల వెలుతుర్లో బంతిని అంచనా వేయటం కష్టంగా ఉంటుందని, ఫ్రాంచైజీ లీగ్‌లో ఆడే కొందరు సీనియర్లు మినహా మిగిలిన యువ ఆటగాళ్లకు ఇది పూర్తిగా కొత్త అనుభవం అని అతడు గుర్తు చేసుకున్నాడు. ఈ పరిస్థితుల్లో మ్యాచ్ జరిగే సమయానికి అనుగుణంగా శిక్షణ పొందే అవకాశం ఇవ్వకపోవడం తమ విజయ అవకాశాలను దెబ్బతీసిందని చెప్పాడు. అయితే, ఈ షెడ్యూలింగ్ వివాదంపై ఐసీసీ స్పందించింది. జనవరి 27నే అన్ని జట్లకు షెడ్యూల్‌ను పంపించామని, నమీబియా నుంచి మార్పుల కోసం అభ్యర్థన చాలా ఆలస్యంగా ఫిబ్రవరి 10న అందిందని వెల్లడించింది. సమయం తక్కువగా ఉండటం వల్ల చివరి నిమిషంలో మార్పులు చేయడం సాధ్యం కాలేదని ఐసీసీ అధికారులు స్పష్టం చేశారు.

# సిక్సర్ల సునామీ..ఒకే ఓవర్‌లో 28 పరుగులు.. రోహిత్ రికార్డు సమం చేసిన ఇషాన్



టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా కుర్రాడు ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఈ వికెట్ కీపర్ బ్యాటర్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. స్టేడియం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడుతూ నమీబియా బౌలర్లకు చుక్కలు చూపించాడు. టీ20 ప్రపంచకప్ 2026లో టీమిండియా కుర్రాడు ఇషాన్ కిషన్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. నమీబియాతో జరిగిన మ్యాచ్‌లో ఈ వికెట్ కీపర్ బ్యాటర్ సృష్టించిన విధ్వంసం అంతా ఇంతా కాదు. స్టేడియం నలుమూలలా సిక్సర్లు, ఫోర్లతో విరుచుకుపడుతూ నమీబియా బౌలర్లకు చుక్కలు చూపించాడు. కేవలం 20 బంతుల్లోనే హాఫ్ సెంచరీ మార్కును అందుకున్న ఇషాన్, ఓవరాల్‌గా 24 బంతుల్లో 61 పరుగులు చేసి భారత్‌కు భారీ స్కోరు అందించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో హైలైట్ ఏదైనా ఉందంటే అది పవర్‌ప్లే చివరి ఓవరే. నమీబియా బౌలర్ జేజే స్మిత్ వేసిన ఆ ఓవర్‌లో ఇషాన్ కిషన్ పూనకం వచ్చినట్లు ఆడాడు. మొదటి బంతి డాట్ అయినప్పటికీ, ఆ తర్వాత వరుసగా నాలుగు బంతులను సిక్సర్లుగా మలిచాడు. చివరి బంతికి ఫోర్ కొట్టి మొత్తం ఆ ఓవర్‌లో 28 పరుగులు పిండుకున్నాడు. దీనితో టీ20 ప్రపంచకప్‌లో ఒకే ఓవర్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో భారతీయ బ్యాటర్‌గా రోహిత్ శర్మ (2024 వరల్డ్ కప్) రికార్డును ఇషాన్ సమం చేశాడు. ఈ జాబితాలో 36 పరుగులతో యువరాజ్ సింగ్ (2007) అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు.ఇషాన్ కిషన్ ఈ మ్యాచ్‌లో 250 పైగా స్ట్రైక్ రేట్‌తో బ్యాటింగ్ చేయడం విశేషం. కేవలం 20 బంతుల్లోనే 50 పరుగులు పూర్తి చేసుకున్న అతను, మొత్తం ఇన్నింగ్స్‌లో 6 ఫోర్లు, 5 కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. ఓపెనర్‌గా వచ్చి పవర్‌ప్లేలోనే జట్టు స్కోరును వందకు చేరువ చేయడం వల్ల భారత్‌కు తిరుగులేని ఆధిపత్యం లభించింది. పవర్‌ప్లేను ఎలా వాడుకోవాలో ఇషాన్ తన ఇన్నింగ్స్ ద్వారా మరోసారి ప్రపంచానికి చాటి చెప్పాడు. నిజానికి ఇషాన్ కిషన్ గత కొంతకాలంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. క్రమశిక్షణ చర్యలు, ఫామ్ లేమి వంటి కారణాలతో సెలెక్టర్లు అతడిని పక్కన పెట్టారు. అయితే పట్టువదలని విక్రమార్కుడిలా దేశవాళీ క్రికెట్‌లో పరుగుల వరద పారించి మళ్లీ నేషనల్ టీంలోకి వచ్చాడు. న్యూజిలాండ్‌తో జరిగిన సిరీస్‌లో సెంచరీ బాది ఫామ్‌లోకి వచ్చిన ఇషాన్, ఇప్పుడు వరల్డ్ కప్ వంటి మెగా టోర్నీలో సత్తా చాటడం విశేషం. టీమిండియా టాప్ ఆర్డర్‌లో ఇలాంటి అగ్రెసివ్ బ్యాటర్ ఉండటం జట్టుకు కొండంత బలాన్నిస్తోంది. సూపర్ 8 దిశగా సాగుతున్న భారత్‌కు ఇషాన్ ఫామ్ చాలా ముఖ్యం. నమీబియా వంటి చిన్న జట్లపైనే కాకుండా పెద్ద జట్లపై కూడా ఇలాగే ఆడితే భారత్ రెండోసారి టీ20 కప్ గెలవడం పెద్ద కష్టమేమీ కాదు. సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో యంగ్ ఇండియా పవర్‌ఫుల్‌గా కనిపిస్తోంది. ముఖ్యంగా ఇషాన్ లాంటి ఆటగాళ్లు క్లిక్ అయితే ప్రత్యర్థి ఎవరైనా సరే వణకాల్సిందే.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...
భక్తి వాయిస్
బిజినెస్ వాయిస్
సినీ వాయిస్
క్రైం వాయిస్
హెల్త్ వాయిస్
కిసాన్ వాయిస్
తీర్పు వాయిస్
సక్సెస్ వాయిస్
వనిత వాయిస్
కిడ్స్ వాయిస్
తీర్పు వాయిస్

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com